విశాలాంధ్ర

ఏలూరు, పశ్చిమ గోదావరి
కాకినాడ, కోనసీమ
తూర్పుగోదావరి

ఆదివారం 23 ఫిబ్రవరి 2025 8 పేజీలు

సచివాలయం... గందరగోళం

- హేతుబద్ధీకరణపై ప్రభుత్వం మల్లగుల్లాలు
- మాతృసంస్థలో విలీనం చేయాలని డిమాండ్
- స్పష్టమైన జాబ్‌చార్ట్ విడుదల చేయాలి

వైసీపీ ప్రభుత్వం సృష్టించిన గ్రామ,వార్డు సచివాలయ వ్యవస్థ ఇప్పటికీ గందరగోళంలోనే కొనసాగుతూనే ఉంది. గత ఐదేళ్ల వైసిపి పాలనలో నెలకొన్న గందరగోళాన్ని సరి చేసేందుకు కూటమి ప్రభుత్వం సచివాలయ ఉద్యోగుల హేతుబద్దీకరణ ప్రక్రియకు శ్రీకారం చుట్టినప్పటికీ, ఒక అడుగు ముందుకు రెండు అడుగులు వెనక్కి అన్న చందంగా సాగుతోంది.



విశాలాంధ్ర బ్యూరో -ఏలూరు: వైసీపీ ప్రభుత్వం దేశంలో ఎక్కడా లేనివిధంగా గ్రామ,వార్డు సచివాలయ వ్యవస్థను సృష్టించింది.పరిపాలనను ప్రజలకు చేరువ చేయడం అన్న పేరుతో రూపొందించిన ఈ వ్యవస్థ నిర్వహణ, పని విధానానికి సంబంధించి విధి విధానాలు రూపొందించ కుండా మొత్తంగా వ్యవస్థను గందరగోళం చేసింది. 2019లో కేవలం 2 నెలల వ్యవధిలో 1,30,000 మంది ఉద్యోగులను నియమించి వారందరినీ గందరగోళంలో పడేసింది. ఐదేళ్లపాటు వారిని పలు రకాల సేవలలో వినియోగించుకున్న గత ప్రభుత్వం వారికి నిర్దిష్టమైన జాబ్ చార్టును కూడా రూపొందించకుండా నిర్లక్ష్యం చేసింది. ఉద్యోగులతో సంబంధం లేని పనులలో కూడా వాడు కుంటూ వారితో వెట్టి చాకిరి చేయించుకుంది. గ్రామ పంచాయతీలకు సమాంతర వ్యవస్థలా సచివాల యాలను నడిపి పంచాయతీ రాజ్ వ్యవస్థను నీరు గార్చింది. కనీసం వారికి డిడిఓ అధికారాలు కూడా ఇవ్వకుండా చాకిరీ చేయించుకుంది. గతంలో సచివాలయ ఉద్యోగులకు సర్వీస్ అంశాలు మాతృ శాఖ నుంచి జీతం మరొక శాఖ నుంచి పర్యవేక్షణ చేసిన పరిస్థితి ఉంది. గత వైసీపీ ప్రభుత్వం సృష్టించిన ఈ గందరగోళాన్ని తొలగించి ఉద్యోగులను హేతుబద్ధీకరించడానికి ప్రయత్నిస్తున్న కూటమి ప్రభుత్వం సవాళ్లను ఎదుర్కొంటోంది.

మిగులు ఉద్యోగులను ఏం చేయాలి?

ఏలూరు జిల్లాలో ప్రస్తుతం 517 సచివాలయాలు ఉండగా 5591 పోస్టులు ఉన్నాయి.ప్రస్తుతం4412 సచివాలయ ఉద్యోగులు పనిచేస్తున్నారు.1179 సచివాలయ పోస్టులు ఖాళీగా ఉన్నాయి.ప్రభుత్వం చేపట్టిన హేతు బద్దీకరణ వల్ల ఒక్కో సచివాలయానికి సగటున 7 గురు ఉద్యోగులు సరిపోతారు. దీంతో జిల్లా మొత్తం సచివాలయాలలో 3619 మంది ఉద్యోగులు సరిపోతారు. మిగతా 1972 మంది ఉద్యోగులు మిగులుతారు. మిగిలిన ఉద్యోగులను ఏం చేస్తారనేది ఉద్యోగులను వెంటాడు తున్న ఆందోళన.

మాతృ శాఖకు పంపాలంటూ విన్నపాలు

రాష్ట్ర సచివాలయంలో గ్రామ,వార్డు సచివాలయాల శాఖా మంత్రి డోల బాల వీరాంజనేయ స్వామి ఆధ్వర్యంలో గతంలో జరిగిన సమావేశంలో సచివాలయ ఉద్యోగులు తమ గోడును ఏకరువు పెట్టారు. సచివాలయ ఉద్యోగులకు జూనియర్ అసిస్టెంట్ గా బదిలీ కల్పించాలని విన్నవించారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన హేతుబద్దీకరణలో చెబుతున్న మల్టీపర్పస్ ఉద్యోగుల విధానాన్ని తొలగించాలని ఉద్యోగులు ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు. ఈ విధానంలో సొంత శాఖ విధులతో పాటు ఇతర శాఖల విధుల భారం కూడా ఉద్యోగులపై పడుతుందని ఉద్యోగులు వాపోతున్నారు. సచివాలయ ఉద్యోగులపై సచివాలయం రెండింటి పర్యవేక్షణ ఉంటే ▶మిగతా 2లో..

ఎమ్మెల్సీ ఎన్నికలపై శిక్షణ

- ఎన్నికల విధులపట్ల అప్రమత్తంగా ఉండాలి
- పోలింగ్ ప్రక్రియ సజావుగా ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలి
- ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ కె. వెట్రిసెల్వి

విశాలాంధ్ర-ఏలూరు: తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల విధులపట్ల సంబంధిత పోలింగ్ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ కె. వెట్రిసెల్వి ఎమ్మెల్సీ పోలింగ్ అధికారులను ఆదేశించారు. శనివారం స్థానిక కలెక్టరేట్ లోని గోదావరి ▶మిగతా 2లో..

వేతన జీవుల్లో ఆశలు రేపి గెలుపొందిన బీజేపీ

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు డేగా ప్రభాకర్ విమర్శ

విశాలాంధ్ర - అమలాపురం : బడ్జెట్లో కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్ ఉద్యోగులకు విధించే ట్యాక్సుల్లో వేతన జీవులకు 12 శాతం రాయితీ కల్పన ప్రకటన చేసి ఢిల్లీ ఎన్నికల్లో బిజెపి లబ్ది పొందిందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు డేగా ప్రభాకర్ విమర్శించారు. శనివారం ముమ్మిడివరం సిపిఐ కార్యాలయంలో శీలశీ వెంకటేష్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో డేగా ప్రభాకర్ మాట్లాడుతూ నిర్మలా బడ్జెట్ కాకుల్ని కొట్టి గ్రద్దల్ని పెంచినట్లు వుందన్నారు. కనీస మద్దతు ధర కోసం ఢిల్లీ రైతులు పోరాటం చేశారని 750 మంది అన్యాయంగా బలైపోతే నల్ల చట్టాలు ఎత్తివేస్తానని తన వల్ల అన్యాయంగా రైతులు చనిపోయారని క్షమాపణ చెప్పిన ప్రధాని మోడీ రైతు మరణాలకు పరిహారం ఇస్తానని రాత పూర్వకంగా ఇచ్చి నమ్మించి మోసం చేశారని అన్నారు. ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు 26 వేల రూపాయలు వేతనం ఇవ్వాలని సుప్రీం కోర్టు తీర్పు ఇచ్చినా ఆచరణ చేయలేదని విమర్శించారు. నిరుద్యోగులకు 2 కోట్లు ఉద్యోగాలు ఇస్తానని మోసం చేశాడని దుయ్యబట్టారు. సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు, రాజమండ్రి జిల్లా కార్యదర్శి తాటిపాక మధు మాట్లాడుతూ కేజీ బేసిన్‌లో లభ్యం అవుతున్న ఆయిల్, గ్యాస్‌ను ప్రైవేటు కంపెనీలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ధారాదత్తం చేస్తున్నాయని ఆందోళన వ్యక్తంచేశారు. ప్రభుత్వం సూపర్ సిక్స్ హామీలు ఇచ్చి ఎన్నికల్లో గెలిచి తొమ్మిది నెలలకే చేతులు ఎత్తేసి మోసం చేసిందని విమర్శించారు. జిల్లా కార్యదర్శి కె.సత్తిబాబు, జీవి రమణ, స్టాలిన్ తదితరులు పాల్గొన్నారు.

శాసనసభలో అగ్రిగోల్డ్ సమస్యలు ప్రస్తావించాలి

అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా గౌరవాధ్యక్షులు కోనాల భీమారావు

విశాలాంధ్ర -తణుకు: అగ్రిగోల్డ్ బాధితుల సమస్యను శాసనసభలో ప్రస్తావించి అగ్రి బాధితులకు న్యాయం చేకూర్చేందుకు తణుకు శాసనసభ్యులు ఆరిమిల్లి రాధాకృష్ణ కృషి చేయాలని అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా గౌరవాధ్యక్షులు కోనాల భీమారావు కోరారు. శనివారం అసోసియేషన్ ఆధ్వర్యంలో తణుకు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణకు తణుకులో ఆయన నివాసం వద్ద వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా భీమారావు మాట్లాడుతూ సమర్థ అధికారుల బృందంతో ప్రత్యేక కమిటీ (ఎస్పివి) ఏర్పాటుచేసి బాధితుల సమస్యలు పరిష్కరించాలని,అగ్రిగోల్డ్ కేసుల సత్వర పరిష్కారానికి ప్రత్యేక ఫాస్ట్ ట్రాక్ కోర్టును ఏర్పాటు చేయించి, జప్తు చేసిన ఆస్తులన్నింటిని కోర్టులో అబ్సెల్యూట్ చేయించాలని కోరారు. జప్తు చేసిన ఆస్తుల రక్షణ బాధ్యతను సి.ఐ.డి. చీఫ్ పర్యవేక్షణలో మండల రెవెన్యూ, పోలీసు అధికారులకు అప్పగించి కాపాడాలని కోరారు. అసెంబ్లీ సమావేశాల్లో అగ్రిగోల్డ్ బాధితుల విషయం పై చర్చించి బడ్జెట్ కేటాయించి సత్వర న్యాయం చేయించాలని కోరారు. అత్యవసర వైద్యం, విద్య, బిడ్డల పెళ్ళిళ్ళు లాంటి అవసరాలు ఉన్నవారికి, లక్షలోపు డిపాజిట్ చేసిన చిన్న పొదుపుదారులకు తక్షణ చెల్లింపులకు తగిన ఏర్పాట్లుచేసి మరో డిపాజిట్ దారుడు బలికాకుండా అదుకోవాలని కోరారు. కార్యక్రమంలో అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యదర్శి వై. నాగలక్ష్మి, తణుకు బ్రాంచి కార్యదర్శి ఎన్. రామశ్రీను, వి. మాణిక్యాంబ, విప్పర్తి గోపి, ఎన్.వెంకట్రావు, జి. దామోదరరెడ్డి, పి.వెంకటేశ్వరరావు, కె. సత్యనారాయణ, డి. నాగిరెడ్డి అగ్రిగోల్డ్ బాధితులు పాల్గొన్నారు.

గోష్పాదక్షేత్రంలో కట్టుదిట్టమైన ఏర్పాట్లు

విశాలాంధ్ర-కొవ్వూరు : ఈ నెల 26న మహా శివరాత్రి పర్వదినం సందర్భంగా భక్తులు పుణ్యస్నానాలు ఆచరించే విధంగా గోష్పాద క్షేత్రంలో అధికారులు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని కొవ్వూరు ఆర్డీవో రాణి సుస్మిత పేర్కొన్నారు. శనివారం కొవ్వూరు ఆర్డీవో కార్యాలయంలో వివిధ సమన్వయ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. అనంతరం గోష్పాద క్షేత్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ పుణ్య స్నానాలకు వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలని, లైటింగ్ ఏర్పాటు చేయాలని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో స్పందించే విధానంలో కొవ్వూరు పట్టణంలో నది తీర ప్రాంతంలో 10 పడవలు, 10 మంది గజఈతగాళ్ళను ఏర్పాటు చేయాలని మత్స్య శాఖ అధికారులను ▶మిగతా 2లో..

రెండు రోజులు ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమం

విశాలాంధ్ర - గణపవరం: గ్రామంలో ప్రజలు తడి చెత్త పొడి చెత్తను వేరువేరుగా ఇవ్వాలని రెండు రోజులు పారిశుధ్యంపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నట్టు గ్రామ సర్పంచ్ మూరా అలంకారం శనివారం అన్నారు.ప్రభుత్వ ఆదేశాలు మేరకు రెండు రోజుల ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలలో భాగంగా మొదటి

రోజు ఉదయం 6 గంటల నుండి గణపవరం గ్రామపంచాయతీ పరిధిలో గల 16 వార్డులకు గాను 8 వార్డులలో 8 టీములుగా పారిశుధ్య కార్మికులను విభజించి ప్రతి ఇంటికి వెళ్ళి తడి చెత్త, పొడి చెత్త పైన అవగాహన కల్పించి ఇంటివద్దనే తడి చెత్త పొడి చెత్త వేరు చేసి ఇవ్వాల్సిందిగా ప్రజలకు తెలియజేసి చెత్త సేకరించినట్టు సర్పంచ్ తెలిపారు. గణపవరం గ్రామ పంచా యతీ పరిధిలో గల అన్నీ ఇళ్ల నుండి తడి పొడి చెత్తను వేరు వేరు గా సేకరించి ఆ చెత్తను ఎస్ డబ్ల్యూ పిసి షెడ్ వద్దకు తరలించడం జరుగుతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి దార్ల శివ రామ ప్రసాద్ గ్రేడ్ -1, పంచాయతీ సిబ్బంది, సచివాలయ సిబ్బంది, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

కూటమి ఎమ్మెల్సీ అభ్యర్థి రాజశేఖర్‌ను గెలిపించాలి

విశాలాంధ్ర - కొయ్యలగూడెం : ఉభయగోదావరి జిల్లాల పట్టభద్రుల ఎంఎల్‌సి ఎన్నికల్లో కూటమి ఆధ్వర్యంలో బలపరిచిన పేరాబత్తుల రాజశేఖర్‌కు తమ విలువైన ఓటును వేసి గెలిపించాలని టిడిపి రాష్ట్ర ఆర్గనైజింగ్ కమిటీ సభ్యురాలు గంగిరెడ్ల మేఘాలాదేవి పేర్కొన్నారు. మండల కేంద్రమైన కొయ్యలగూడెం పట్టణంలో జిల్లా పరిషత్ బాలికల

ఉన్నత పాఠశాలలో, బాలుర ఉన్నత పాఠశాలలో, అంగన్వాడి కేంద్రాల టీచర్ల వద్ద ఆమె శనివారం ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈమె వెంట కొత్త రమ , పార్టీ నాయకులు ఉన్నారు.

పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం

విశాలాంధ్ర -ఏలూరు: పరిసరాల పరిశుభ్రతతో సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందని తేదేపా ఎస్.సి. సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు జాలా బాలాజీ పేర్కొన్నారు. స్థానిక శాసనసభ్యులు బడేటి రాధా కృష్ణయ్య (చంటి) పర్య వేక్షణలో శనివారం 3వ డివిజన్ లో పారిశుధ్య మురుగు కాలువలలో పూడికతీత పనులు నిర్వహించారు. సత్యనారాయణ పేట, ఏసుపాదపురం, సచివాలయానికి ఇరువైపులా, పారిశుధ్య పనులను తేదేపా ఎస్.సి.సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు జాలా బాలాజీ దగ్గ రుండి పర్యవేక్షించా రు. పారిశుధ్య పనులు మురుగు

కాలువలను పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని పారిశుద్ధ్య సిబ్బందితో తొలగింప చేశారు.ఈ సందర్భంగా బాలాజీ మాట్లా డుతూ గత కొన్ని రోజులుగా మురుగు కాలువలలో చెత్త పేరుకు పోయి దుర్గంధం వెదజల్లుతోందని తెలిపారు. ప్రజలందరూ నగర అభివృద్ధికి, స్వచ్ఛ నగరంగా ఉండటానికి సహకరించాలని కోరారు.

రాజేంద్రప్రసాద్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలి

విశాలాంధ్ర- కైకలూరు: మాజీమంత్రి, కూటమి బలపరిచిన గుంటూరు, కృష్ణ గ్రాడ్యుయేట్స్ ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ గెలుపు అభివృద్ధికి మలుపు అని జనసేన నాయకులు, ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ

తెలిపారు.శనివారం కైకలూరు మండలం ఆటపాక గ్రామంలోని శ్రీచైతన్య స్కూల్లోని ఉపాధ్యాయులను ఎమ్మెల్సీ వెంకటరమణ, రాష్ట్ర గౌడ కార్పొరేషన్ చైర్మన్ వీరంకి గురుమూర్తి,కూటమి నాయకులు కలిసి కరపత్రాలు పంపిణీ చేసి ఈనెల 27న జరిగే ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఆలపాటి రాజేంద్రప్రసాద్‌కు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి అఖండ విజయం చేకూర్చాలని అభ్యర్థించారు. ఈ ప్రచారంలో కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణాలను పరిశీలించిన మున్సిపల్ చైర్మన్

విశాలాంధ్ర-జంగారెడ్డిగూడెం: పట్టణంలో శరవేగంగా జరుగుతున్న సిసి రోడ్ల నిర్మాణాలను శనివారం మున్సిపల్ చైర్మన్ బత్తిన నాగలక్ష్మి, వార్డ్ కౌన్సిలర్ పరిశీలించారు. జరుగుతున్న నిర్మాణ పనులపై పూర్తి సంతృప్తి వ్యక్తం చేశారు.నిర్మాణ కాంట్రాక్టర్ గూడపాటి రాధాకృష్ణను అభినందించారు.మిగిలిన రోడ్లు,డ్రైనులు కూడా సకాలంలో నిర్మాణాలు పూర్తి చేసి కాంట్రాక్టర్లకు త్వరితగతిన బిల్లులు ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో బత్తిన

చిన్న, కాసర తులసిరెడ్డి,కాసర సుబ్బారెడ్డి, రంగా , వార్డు సెక్రెటరీ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంలో అభివృద్ధి పరుగులు : ఎంపీ మహేష్

విశాలాంధ్ర ప్రతినిధి-ఏలూరు : ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం అధికార పగ్గాలు చేపట్టిన నాటి నుంచి రాజధాని అమరావతి, ఆంధ్రుల జీవనాడి పోలవరం ప్రాజెక్టు వంటి అభివృద్ధి పనులు పరుగులు తీస్తున్నాయని ఎంపీ పుట్టా మహేష్ కుమార్ తెలిపారు. ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గం నుంచి కూటమి ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న పేరాబత్తుల రాజశేఖర్ కు మద్దతుగా ఎమ్మెల్యే బడేటి చంటి, జడ్పీ చైర్మన్ ఘంటా పద్మశ్రీతో కలిసి శనివారం ఏలూరులో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఏలూరు సీఆర్ రెడ్డి విద్యా సంస్థలకు వెళ్లి ఉపాధ్యాయులు, అధ్యాపకులతో సమావేశం నిర్వహించి ఓట్ల అభ్యర్థించారు. అనంతరం ఏలూరులోని అతిథి హోటల్ లో ఏపీపీయూఎస్ఎంఏ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రైవేటు పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యావంతుల సమావేశంలో ఎమ్మెల్యే బడేటి చంటి, జడ్పీ చైర్మన్ ఘంటా పద్మశ్రీ, ఎమ్మెల్సీ ఎన్నికల పరిశీలకురాలు ఆచంట సునీతతో కలసి ఎంపీ మహేష్ కుమార్ పాల్గొన్నారు.

ఏర్పాట్లు (1వ పేజీ తరువాయి)

ఆదేశించారు. మహాశివరాత్రి ఉత్సవాలు ప్రణాళికాబద్ధంగా నిర్వహించేందుకు అన్ని ప్రభుత్వ శాఖల అధికారులను సన్నద్ధం చేస్తున్నట్లు ఆమె తెలిపారు. సోమవారం నుంచి బుధవారం వరకు ఎక్కువ మంది భక్తులు కొవ్వూరు చేరుకునే అవకాశం ఉందని తెలిపారు. ఈనెల 24 సోమవారం శ్రీ బాలా త్రిపుర సుందరి సమేత సుందరేశ్వరుల కళ్యాణ మహోత్సవం ప్రారంభమవు తుందన్నారు. 25 మంగళవారం నిత్యా ఔపోసన, బలిహారం, సాంస్కృతిక కార్యక్రమా లు ఉంటాయన్నారు. 26 బుధవారం మహాశివరాత్రి పర్వదినం రోజున పుణ్య స్నానాలు, రుద్రాభిషేకాలు, అర్ధ రాత్రి లింగో ద్భవ కాలంలో అభిషేకాలు ఉంటాయని తెలిపారు. ఈ సందర్భంగా డి.ఎస్.పి, జి. దేవ కుమార్ మాట్లాడుతూ కొవ్వూరులో ఈనెల 25వ తేదీ అర్ధరాత్రి నుండి ట్రాఫిక్ కు అంతరాయం రాకుండా డైవర్షన్ చేసినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమి షనర్ టి రాజేంద్రకుమార్, ఆర్ బి డి ఈ, బివి రమణ, ఏ ఈ,ఏజీ ఆ ర్ బి.జి. మణి కంఠ రాజు, డిప్యూటీ డి ఎం అండ్ హెచ్ ఓ, జే.సంధ్య, ఇన్స్పెక్టర్ ఆఫ్ ఫెషరీస్, పి కృష్ణవేణి, ఆల య అర్చకులు యం. శ్రీనివాస మూర్తి తది తరులు పాల్గొన్నారు.

శిక్షణ (1వ పేజీ తరువాయి)

సమావేశ మందిరంలో ఈనెల 27వ తేదీన తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల నియోజకవర్గ పట్టభద్రుల ఎన్నికల సందర్భంగా ఏలూరు జిల్లాకు సంబంధించి ఎన్నికల పోలింగ్ విధులు నిర్వహించే పివో, ఏపివో లకు రెండో విడత శిక్షణాతరగతులు నిర్వహించారు. పోలింగ్ కేంద్రంలో విధులు, పోలింగ్ ప్రక్రియపై పూర్తి అవగాహన కల్పించారు. బ్యాలెట్ బాక్సులు తెరవడం, సీల్ చేయడం వంటి అంశాలపై క్షుణ్ణంగా అవగాహన కల్పించారు. పోలింగ్ ప్రక్రియ నిర్వహణకు సంబంధించి పలు ప్రశ్నలు వేసి ఎన్నికల సిబ్బంది నుంచి సమాధానాలను కలెక్టర్ రాబట్టారు. ఈ సందర్భంగా వారి సందేహాలు నివృత్తి చేశారు. ఈనెల 27వ తేదీన ఉదయం 8 గం. నుంచి సాయంత్రం 4 గం. వరకు పోలింగ్ నిర్వహించడం జరుగుతుందన్నారు.

బ్యాలెట్ బాక్సుల నిర్వహ ణపై పూర్తి అవగాహన కలిగియుండాలన్నారు.ఈ ఎన్నికల్లో మొత్తం 35 మంది అభ్యర్థులు పోటీల్లో ఉన్నారని వివరించారు. అందుకు సంబంధించిన బ్యాలెట్ పేపర్ ను ఏ విధంగా మడతపెట్టి బ్యాలెట్ బాక్సుల్లో వేసే విధానం గురించి వివరించారు. ఎన్నికల సామాగ్రి డిస్ట్రిబ్యూషన్ సెంటర్ లో ఎన్నికలకు సంబంధించిన బ్యాలెట్ బాక్సులు స్వీకరణ, స్టాట్యూటరి, నాన్ స్టాట్యూటరి కవర్లు, పోలింగ్ మెటీరియల్స్ చెక్ లిస్టు ప్రకారం పరిశీలించుకుని తీసుకోవాలన్నారు. తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల నియోజకవర్గ పట్టభద్రుల ఎన్నికలకు 3,14,984 మంది ఓటర్లు తమ ఓటుహక్కును వినియో గించుకుంటారని తెలిపారు. ఏలూరు జిల్లా పరిధిలో 62 పోలింగ్ కేంద్రాల్లో 42,282 మంది ఓటర్లు కలిగియున్నారని ఇందులో పురుషులు 24,704 మంది, మహిళలు 17,571 మంది, ట్రాన్స్ జెండర్లు 7 గురు ఉన్నారని తెలిపారు. కార్యక్రమంలో డిఆర్ఓ వి. విశ్వేశ్వరరావు, ఏలూరు ఆర్డీఓ అచ్యుత అంబరీష్, డిఆర్డిఏ పిడి ఆర్. విజయ రాజు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ యం.ముక్కంటి, పివో, ఏపివోలు తదితరులు పాల్గొన్నారు.

గందరగోళం (1వ పేజీ తరువాయి)

అది గతంలో మాదిరిగా గందరగోళానికి దారితీస్తుందని అంటున్నారు. సచివాలయ ఉద్యోగులకు నిర్దిష్టమైన జాబ్ చార్ట్‌ను రూపొందించి అమలు చేయాలని కోరుతున్నారు. ప్రస్తుతం పంచాయతీరాజ్ వ్యవస్థలో 6 గ్రేడులుగా ఉన్న పంచాయతీ కార్యదర్శులను మూడు గ్రేడులకు కుదించాలని, గ్రేడ్-1,2 జోనల్ పోస్టులను గ్రేడ్-1గా, గ్రేడ్- 3,4,5 లను గ్రేడ్ -2 గా, గ్రేడ్-6 ను గ్రేడ్-3 గా మార్చాలని మంత్రికి విజ్ఞప్తి చేశారు. సచివాలయం, పంచాయతీ డిడిఓ,కన్వీనర్ బాధ్యతలు నిర్వహించే ఉద్యోగులకు హోదాకు తగినట్లుగా సీనియర్ అసిస్టెంట్ పే స్కేల్ ఇవ్వాలని కోరారు.

హేతుబద్ధీకరణకు సంబంధించి గత నెల రోజులుగా కూటమి ప్రభుత్వం కసరత్తు చేస్తుంది.అది ఇప్పటి వరకు ఒక కొలిక్కి రాలేదు. ఉద్యోగుల హేతుబద్ధమైన విజ్ఞప్తులను పరిగణంలోనికి తీసుకుని,శాస్త్రీయమైన పరిష్కారం కనుగొనక లేకపోతే సమస్య మరింత జటిలం అయ్యే ప్రమాదం ఉంది.

గుండెపోటుతో ఉపాధ్యాయుడు మృతి

విశాలాంధ్ర-లింగపాలెం/ముసునూరు: ఉపాధ్యాయునిగా పనిచేస్తున్న తొమ్మండ్రు రత్న కుమార్(56) తన నివాసమైన ధర్మాజీగూడెంలో గుండెపోటుతో హఠాన్మరణం చెందారు. ఈయన మృతి ఉపా ధ్యాయ వర్గా లలో, అభి మానుల్లో, బంధువులలో తీవ్ర దిగ్భ్రాంతిని కలిగించింది. ప్రతి ఒక్కరితో స్నేహంగా ఉంటూ అజాతశత్రువుగా పేరుపొందిన రత్నకుమార్ మృతి పట్ల అనేకమంది ఆవేదన వ్యక్తం చేశారు. ధర్మాజీ గూడెం లో నివాసం ఉంటున్న ఈయన ముసునూరు మండలం గుడిపాడు మండల పరిషత్ పాఠశాలలో

ఉపాధ్యాయునిగా పనిచేస్తున్నారు. శనివారం తెల్లవారుజామున గుండెపోటు రావడంతో స్థానిక ఆసుపత్రికి తీసుకువెళ్లగా అప్పటికే ఈయన మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఈయనకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.ఈయన మృతిపట్ల లిడ్ క్యాప్ మాజీ డైరెక్టర్ సొంగా సందీప్, మండల పరిషత్ ఉపాధ్యక్షులు మట్టా సురేష్ ఉపాధ్యాయ సంఘ నాయకులు సొంగా నాగేశ్వరరావు, లక్క పాము ప్రకాశరావు, ఎస్.తిరుపతి, చందాలు, ఎమ్మార్పీఎస్ నాయకులు ముళ్ళపూడి సుమన్ తదితరులు నివాళులు అర్పించారు. ఈయన స్వగ్రామ మైన లోపూడిలో అంత్యక్రియలు నిర్వహించారు.

ఘనంగా మౌలానా అబుల్ కలాం ఆజాద్ వర్ధంతి

విశాలాంధ్ర - కొయ్యలగూడెం : స్వాతంత్ర్య సమరయోధుడు, భారతదేశ మొట్టమొదటి విద్యాశాఖ మంత్రి మౌలానా అబుల్ కలాం ఆజాద్ వర్ధంతిని మండలంలో కుంతల గూడెం

గ్రామంలో ఉన్న ప్రాథమికోన్నత పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాయపూడి వెంకటరమణ మాట్లాడుతూ భారత దేశంలో విద్యావ్యాప్తికి, అభివృద్ధికి, అబుల్ కలాం చేసిన సేవలను విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు కె. అమృత, కె. ఏసేపు, కె.రూత్ పాలేనా,బాల బాలికలు పాల్గొన్నారు.

విద్యార్థులు భావితరాలకు ఆదర్శంగా ఉండాలి

విశాలాంధ్ర-లింగపాలెం: విద్యార్థులు ఎదిగే కొద్ది ఒదిగి ఉండాలని శ్రీ ప్రతిభ శ్రీ జూనియర్ కళాశాలల డైరెక్టర్ సుజాత కుమారి తెలిపారు. సీనియర్ ఇంటర్ విద్యార్థులకు, జూనియర్ ఇంటర్ విద్యార్థులు వీడ్కోలు సభను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు

ఒకరికొకరు తమ అనుభవాలను పంచుకున్నారు. ఈ సందర్భంగా కాలేజీల డైరెక్టర్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి క్రమశిక్షణతో,మంచి ప్రవర్తన కలిగే ఉన్నప్పుడు ఉన్నతులుగా ఎదుగుతారని భావితరాల పౌరులకు మార్గదర్శకులుగా నిలుస్తారని తెలిపారు. ఈ సందర్భంగా డైరెక్టర్ వచ్చే విద్యా సంవత్సరం నుంచి ప్రతిభ జూనియర్ కాలేజీని ఉమెన్ కాలేజీగా వచ్చే ఏడాది నుంచి మారుస్తున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్ర మంలో కాలేజీల కరస్పాండెంట్ నరసింహారావు, ప్రిన్సిపాల్ రత్నాకర్ రావు,సాంబయ్య అధ్యాపకులు విద్యార్థిని,విద్యార్థులు పాల్గొన్నారు.

స్వాతంత్ర్యం కోసం ప్రాణత్యాగం చేసిన కన్నెగంటి

విశాలాంధ్ర - కొయ్యలగూడెం : స్వాతంత్ర్య సమరయోధుడు కన్నెగంటి హనుమంతు 103వ వర్ధంతి సందర్భంగా కొయ్యల గూడెం పట్టణంలో ప్రధాన రహదారిపై ఉన్న విగ్రహాల జంక్షన్ వద్ద హనుమంతు చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళు లు అర్పించారు. ఈ సందర్భంగా సీపీఐ మండల కార్యదర్శి తాటిగడప ఆంజనేయరాజు మాట్లాడుతూ హనుమంతు తన గ్రామంలో ఉన్న 200 కుటుంబాలలో కుటుంబానికి ఇద్దరు చొప్పున స్వాతంత్ర యోధులను తయారు చేశారని, స్వాతంత్ర పోరాటంలో పాల్గొని తెల్ల దొరలపై పోరాటం కొనసాగించి భారతదేశ స్వాతంత్ర్యం కోసం తన ప్రాణాలను కూడా త్యాగం చేసిన కన్నెగంటి హనుమంతు పల్నాడు జిల్లా దుర్గి మండలం మించాలపాడు గ్రామంలో ఇప్పటికీ సరైన వసతులు లేక, త్రాగడానికి నీరు లేక ఆ గ్రామ ప్రజలంతా ఇబ్బంది పడుతున్నారని అన్నారు. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు కన్నెగంటి హనుమంతు గ్రామాన్ని అభివృద్ధి చేయాలని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి, జనసేన, వైయస్సార్సీపి, బిజెపి, పార్టీల నాయకులు పాల్గొన్నారు.

ఎస్.ఎస్.సి. నూరు శాతం ఉత్తీర్ణత సాధించాలి

విశాలాంధ్ర-భీమడోలు: పది పరీక్షలలో నూరు శాతం ఉత్తీర్ణత సాధించాలని ఏలూరు ఎంపీ పుట్ట మహేష్ కుమార్, టిడిపి జిల్లా అధ్యక్షులు గని వీరాంజనేయులు పేర్కొన్నారు. భీమడోలు గ్రామంలో మాంటిస్సోరీ విద్యాసంస్థల్లో భాగమైన పాలేటి స్కూలులో స్కూల్ విద్యార్థులు శ్రీమాధురి జూనియర్ కళాశాల విద్యార్థులకు కలిపి జరిగిన ఫేర్ వెల్ కార్యక్రమానికి మాంటిస్సోరీ విద్యాసంస్థల అధినేత ప్రేమ్ కుమార్ అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా పాల్గొన్న పుట్టా మహేష్ కుమార్,గన్ని వీరాంజనేయులు మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, అధ్యాపక బృందం, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

115 మందికి ఆయుర్వేద వైద్య పరీక్షలు

విశాలాంధ్ర-ఉంగుటూరు : నీలాద్రిపురం గ్రామంలో ఉంగుటూరు ఆయుర్వేద ఆసుపత్రి ఆధ్వర్యంలో శనివారం వైద్య శిబిరం నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో 115 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయుర్వేద ఆసుపత్రి డాక్టర్ కస్తూరి శిరీష రోగులకు తగిన వైద్య సలహాలు, సూచనలు అందించారు. ఈ కార్యక్రమంలో కృష్ణకుమారి, కాలి మంగన్న, ఉంద్రాజవరపు దుర్గారావు, రాట్నాల నాగరాజు తదితర వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

120 మందికి ఉచిత కంటి వైద్య పరీక్షలు

విశాలాంధ్ర-టి నరసాపురం: 120 మందికి కంటి వైద్య పరీక్షలు నిర్వహించినట్లు జంగారెడ్డిగూడెం రామచంద్ర కంటి ఆసుపత్రి వైద్యులు డి.ఆదిత్య తెలిపారు. మండలంలోని మక్కినవారి గూడెం సొసైటీ ఆవరణలో మాజీ సొసైటీ అధ్యక్షులు ఆచంట సూర్యనారాయణ ఆధ్వర్యంలో జంగారెడ్డిగూడెం రామచంద్ర కంటి ఆసుపత్రి వైద్య బృందం ఉచిత కంటి వైద్య శిబిరం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదిత్య మాట్లాడుతూ 120 మందికి కంటి సమస్యలతో బాధపడుతున్న వారికి వైద్య పరీక్షలు నిర్వహించామని వీరిలో 40 మందికి ఉచితంగా కళ్లజోళ్లు పంపిణీ చేశామన్నారు. 35 మందికి కంటి ఆపరేషన్లు అవసరమని సూచించినట్లు తెలిపారు. సొసైటీ మాజీ అధ్యక్షులు సూర్యనారాయణ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత ప్రజలకు ఉచిత వైద్య శిబిరాలు ఎంతగానో దోహదపడుతా యన్నారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సొసైటీ సిఇఓ యువివి సత్యనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.



పురపాలక సంఘాల నుండే వేతనాలు చెల్లించాలి

ఏఐటీయూసీ డిమాండ్

విశాలాంధ్ర-ఏలూరు: నగరపాలక సంస్థలలో, పురపాలక సంఘాలలో, నగర పంచాయతీలలో పనిచేస్తున్న ఔట్సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగ సిబ్బందికి పనిచేస్తున్న సంస్థల ద్వారా వేతనాలు చెల్లించాలని ఎఐటియుసి ఏలూరు జిల్లా ఉపాధ్యక్షులు బండి వెంకటేశ్వరరావు, ది జోనల్ మున్సిపల్ ఎంప్లాయిస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి ఎ.అప్పలరాజు డిమాండ్ చేశారు. శనివారం స్థానిక కోటదిబ్బ ఎస్ ఆర్ వన్ వద్ద మస్టర్ టైం లో ది జోనల్ మున్సిపల్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూని యన్ (ఏఐటీఎంసీ)రాష్ట్ర పిలుపులో భాగంగా ప్రసార కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా బండి వెంకటేశ్వరరావు, అప్పలరాజు మాట్లాడుతూ గత ప్రభుత్వం తీసుకొచ్చిన ఆప్కాస్ సంస్థను రద్దుచేసి ఎన్డీఏ ప్రభుత్వం మరలా ప్రైవేటు వ్యక్తులను కాంట్రాక్టర్లుగా నియమించడానికి ప్రయత్నిస్తుందని విమర్శించారు. రాష్ట్రంలో ఎన్ డి ఏ ప్రభుత్వం ఏర్పడక ముందు ఎన్నికల ప్రచారం సందర్భంగా ప్రభుత్వ శాఖలలో పనిచేస్తున్న ఔట్సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగ సిబ్బందిని రెగ్యులర్ చేస్తామని హామీ ఇచ్చిందని వారు తెలిపారు. ప్రభుత్వం ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఈనెల 24 సోమవారం నాడు ఏలూరు కార్పొరేషన్ కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమం చేపట్టనున్నట్లు వారు వివరించారు.ఈ కార్యక్రమంలో టాప్ ఇన్స్పెక్టర్ సిహెచ్ హరినాద్ బాబు, ఫిట్టర్ దుర్గాప్రసాద్, యూనియన్ నాయకులు ఎస్ఎంవి సుబ్బారావు, ఎస్ గౌరీ శంకర్, బాజీ,షాన్,కే. శ్రీనివాసరావు, దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

శివరాత్రి ఉత్సవాలకు సిద్ధమైన భలే రామస్వామి

విశాలాంధ్ర -నూజివీడు :త్రేతా యుగంలో శ్రీరామచంద్రుని చేత ప్రతిష్టించబడి నాటి నుండి పూజలందుకుంటున్న శ్రీ రామలింగేశ్వర స్వామి వేం చేసి ఉన్న దక్షిణ కాశీగా పేరుగాంచిన ఏలూరు జిల్లాలోని ముసునూరు మండలం బలివే శివరాత్రి ఉత్సవాలకు సిద్ధమయ్యింది. 23వ తేదీ ఆదివారం ప్రారంభమయ్య బలివే ఉత్సవాలు 28వ తేదీ వరకు జరుగునున్నాయి. భలే రామస్వామిగా భక్తులతో పిలిపించుకునే రామలింగేశ్వర స్వామిని త్రేతాయుగంలో శ్రీరామ చంద్రుడు ప్రతిష్టించినట్లు చరిత్ర ద్వారా మనకు తెలుస్తుంది. భలే రామస్వామికి సంబంధించి ఆలయ స్థల పురాణం ఈ విధంగా ఉంది. రావణ సంహారం అనం తరం బ్రహ్మ హత్య దోష నివారణార్థం శ్రీరామచంద్రుడు విశేషమైన పలు ప్రాంతాల్లో ఈశ్వర ప్రతిష్ట చేసుకుంటూ అయోధ్యకు బయలుదేరినాడని ఈ క్రమంలో బలివే లోని స్థలాన్ని చూసిన శ్రీరామచంద్రుడు రామలింగేశ్వర స్వామిని పశ్చిమాభిముఖంగా ప్రతిష్టించి పూజలు గావించినాడని స్థల పురాణం చెప్తుంది. అనంతరం ఈ ప్రాంతంలో నూరు శివ లింగాల ప్రతిష్టలు జరుగగా కాలక్రమేణా అవి శిథిలమైపోగా నాలుగైదు మాత్రమే ఉన్నాయని వాటిలో ఒకటి శ్రీ మృత్యు మల్లేశ్వర స్వామి వారి ఆలయం. ఈ ఆలయం తాతగుడిగా ప్రసిద్ధి చెందింది. ప్రతి శివరాత్రికి రామలింగేశ్వర స్వామి కళ్యాణం అనంతరం ఊరేగింపుగా తాత గుడికి వెళ్లి తాత గారి ఆశీర్వాదం తీసుకుని సాంప్రదాయం నడుస్తుంది. ఈ ప్రాంతాన్ని బలి అనే రాజు పరిపాలించిన కారణంగా ఈ గ్రామానికి బలివే అనే పేరు వచ్చినట్లు చరిత్ర చెబుతోంది. ఈ క్షేత్రంలో స్వామికి అభిషేకం జరపడానికి నీరు లేకపోవడాన్ని గ్రహించిన లక్ష్మణ స్వామి బాణం సంధించి పాతాళ గంగను ప్రవహించేటట్లు చేయడంతో తమ్ముడు వేసిన బాణమునకు నీరు వచ్చిన కారణంగా తమ్మిలేరు అనే పేరు వచ్చినట్లు స్థల పురాణం చెబుతోంది. ఏలూరు,కృష్ణ జిల్లాల నుంచే కాక రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుంచి లక్షల సంఖ్యలో ప్రజలు పాల్గొంటారు.

భక్తుల కోసం సౌకర్యాల ఏర్పాటు

బలివే ఉత్సవాలలో పాల్గొన్నందుకు వచ్చే భక్తుల కోసం దేవాదాయ శాఖ, ఇతర శాఖల సమన్వయంతో పలు అభివృద్ధి పనులను చేపట్టారు. తమ్మిలేటిలో స్నానమాచరించేం దుకు భక్తుల సౌకర్యార్థం మూడు ఘాట్లను నిర్మించారు. దేవస్థానం వద్ద క్యూలైన్లు బారికేడ్లను ఏర్పాటు చేసి భక్తులు స్వామివారిని దర్శించుకునేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు.

త్రాగునీటి వనరులను కలుషితం చేస్తే కఠిన చర్యలు

విశాలాంధ్ర -భీమవరం: పంట కాలువలను అపరిశుభ్రం చేసే వారిపై కఠినంగా వ్యవహరించాలని, పంట కాలువల్లో వ్యర్థాలు వేయకుండా ప్రజలకు అర్థమయ్యే పద్ధతుల్లో అవగాహన కల్పించాల్సిన బాధ్యత అధికారులపై ఉందని ఫోక్సో కోర్టు ప్రత్యేక న్యాయమూర్తి డాక్టర్ బి.లక్ష్మి నారాయణ అన్నారు. పట్టణంలో ప్రవహిస్తున్న పంట కాలువల్లో వ్యర్థాలు, ప్లాస్టిక్, చెత్తాచెదారం వేయడాన్ని నిరోధించేలా చేపట్టాల్సిన చర్యలపై పలు విభాగాల అధికారులతో న్యాయమూర్తి శనివారం సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో మునిసిపల్ కమీషనర్ కె.రామచంద్రారెడ్డి, ఇరిగేషన్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

వేసవిలో మంచినీటి సరఫరాకు పటిష్ట చర్యలు : కమిషనర్

విశాలాంధ్ర ప్రతినిధి- ఏలూరు : రాబోయే వేసవికాలంలో నగర ప్రజలకు మంచినీటి సరఫరా విషయంలో ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని పటిష్ట చర్యలు తీసుకున్నట్లు నగరపాలక సంస్థ కో-ఆప్షన్ సభ్యులు ఎస్ఎంఆర్.పెదబాబు, కమిషనర్ ఎ.భాను ప్రతాప్ చెప్పారు. శనివారం దెందులూరులో ఉన్న గోదావరి జలాల చెరువును వారిరువురూ పరిశీలించారు. గోదావరి జలాలు ఏలూరు కాలువ ద్వారా పూర్తి స్థాయిలో రాకపోవడం కారణంగా దెందు లూరులో ఉన్న నగరపాలక సంస్థ (సమ్మర్ సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్) చెరువులోని నీటి నిల్వలు తగ్గాయి. దీంతో గత నెల రోజులుగా ఏలూరు ఎమ్మెల్యే బడేటి రాధాకృష్ణయ్య, మేయర్ నూర్జహాన్ పెదబాబు మున్సిపల్ కమిషనర్ భాను ప్రతాప్ అధికారులతో అనునిత్యం నీటి సరఫరా విషయంలో సమస్యలు తలెత్తకుండా ఉండేందుకు సమీక్ష నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగానే ఈ నెల 22వ తేదీన మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలోని మేయర్ ఛాంబర్‌లో మంచినీటి సమస్యపై ఎమ్మెల్యే బడేటి రాధాకృష్ణయ్య, మేయర్ నూర్జహాన్ పెదబాబు ప్రత్యేక సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ మేరకు గోదావరి జలాలు నిలిచిపోయేలోగా దెందులూరులోని చెరువును పూర్తిస్థాయి నీటిమట్టంతో నింపేందుకు ప్రత్యేక మోటార్లతో చర్యలు తీసుకోగా పెదబాబు, కమిషనర్ భాను ప్రతాప్ శనివారం క్షేత్రస్థాయిలో పరిశీలించి అధికారులకు పలు సలహాలు సూచనలు అందించారు. గోదావరి కాలువ ద్వారా వస్తున్న నీటి జలాలను, పంపింగ్ మోటార్ల పనితీరును పరిశీలించారు. అనంతరం చెరువులో నిల్వ ఉన్న గోదావరి జలాల నీటి సామర్థ్యాన్ని పరిశీలించి సాధ్యమైనంత త్వరగా గోదావరి జలాలు పంపిణీ పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీఈ తాతబ్బాయి, ఎలక్ట్రికల్ ఏఈ సాంబశివరావు ఉన్నారు.

క్రైస్తవులపై దాడుల నియంత్రణకు కృషి చేస్తా

విశాలాంధ్ర - కొయ్యలగూడెం : క్రైస్తవులపై జరుగుతున్న దాడులను అడ్డుకోవడానికి కృషి చేస్తా అని నూతనంగా ఎన్నికైన పాస్టర్స్ రైట్స్ ప్రొడక్షన్ ఫోరం అధ్యక్షులు బొగ్గవరపు బాబురావు తెలిపారు. మండల కేంద్రమైన కొయ్యలగూడెం పట్టణంలో తారక రామానగర్‌లో జరిగిన పాస్టర్స్ సమావేశంలో అధ్యక్షుడిగా బాబురావు, గౌరవ అధ్యక్షులుగా హెూప్ మినిస్ట్రీ అధినేత బి.సామ్యూల్, చీఫ్ అడ్వైజర్ బి. బర్నబాస్, అడ్వైజర్ గా తియోలా ఫిలిప్స్, లీగల్ అడ్వైజర్ టిఎన్. స్నేహన్, వైస్ ప్రెసిడెంట్ గా పి .పాల్ సుధాకర్, సెక్రటరీగా కోటిపల్లి బెంజిమెన్, జాయింట్ సెక్రటరీగా పి. జాన్ చారి, ట్రెజరర్‌గా ఇ. రత్న వరప్రసాద్, సభ్యులుగా జే. కృపావరం, యు. జీవన్, బొబ్బర జోసెఫ్‌లను నియమించినట్లు బాబురావు తెలిపారు. క్రైస్తవులంతా ఒకటవ్వాలని ఆయన పేర్కొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన

విశాలాంధ్ర-టి నరసాపురం: సైబర్ నేరాల పై అవగాహన కలిగి ఉండాలని ఎస్ఐ ఎం.జయబాబు తెలి పారు. మండలంలోని టి నరసాపురం, బొర్రం పాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో విద్యార్థులకు సైబర్ నేరాలు, బాలికల వేధిం పులు, ఆర్థిక మోసాలు, నకిలీ రుణ యాప్‌ల పై చిట్టి వాహనం ద్వారా జిఎంఎస్కె, అభయ బృందంతో కలిసి శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ ప్రస్తుతం ఆన్ లైన్ మోసాలు ఎక్కువయ్యాయన్నారు. సైబర్ నేరగాళ్లు ప్రజలను మోసం చేసి నగదు దోచుకుంటున్నారని అన్నారు. సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలని అనుమానితులనుండి ఫోన్‌కాల్ వస్తే ఓటీపీలు చెప్పవద్దు అన్నారు. వ్యక్తి గత సమాచారాన్ని ఎవ్వరితోనూ పంచుకోవద్దని అనుమానం ఉంటే వెంటనే 1930, 112, 1098 నెంబర్ లకు సమాచారం ఇవ్వాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ సిబ్బంది, పోలీసులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించండి

సీపీఐ విజ్ఞప్తి

విశాలాంధ్ర-చింతలపూడి: చింతలపూడి నుండి వయా కాంతం పాలెం వెంకటాపురం వెంకటాద్రి గూడెం గణిజర్ల మీదుగా రాఘవాపురానికి ఆర్టీసీ బస్సును ఏర్పాటు చేయాలని సిపిఐ నాయకులు శనివారం ఏపీఎస్ఆర్టీసీ ఏలూరు రీజియన్ మేనేజర్‌కు వినతి పత్రాన్ని సమర్పించారు. కాంతంపాలెం, వెంకటాపురం, వెంకటాద్రి గూడెం, గణిజర్ల గ్రామాలకు చెందిన ప్రజలు సంతకాలు చేసి ఇచ్చిన మెమోరాండం కాపీని కూడా ఆర్టీసీ రీజనల్ మేనేజర్ కు సమర్పించారు. గత 20 సంవత్సరాల క్రితం ఆ రూట్ లో ఆర్టీసీ బస్సు నిలుపుదల చేశారని సిపిఐ నాయకులు ఆర్ .యం. కు వివరించారు. ఈ సందర్భంగా సిపిఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ

కృష్ణ చైతన్య, సిపిఐ చింతలపూడి మండల సహాయ కార్యదర్శి తుర్లపాటి బాబు, మాట్లాడుతూ గత 5 సంవత్సరాలుగా ఆ రూట్ లో బస్సు సర్వీసు లేక ప్రజలు ముఖ్యంగా విద్యార్థులు, గర్భిణీ స్త్రీలు, రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు.రైతులు పండించిన వాణిజ్య పంటలు, కూరగాయలు, ఇతర పంటల ఉత్పత్తులు ఇటు చింతలపూడికి, అటు సత్తుపల్లికి తీసుకెళ్ళుటకు ఆర్టీసీ సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఆర్టీసీ రీజనల్ మేనేజర్ సిపిఐ నాయకులు సమర్పించిన వినతి పత్రంపై స్పందిస్తూ మార్చి 8 వరకు ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ఉందని,మార్చి 8 తర్వాత ఆర్టీసీ డిపో మేనేజర్‌ను రూట్ సర్వేకు పంపించి బస్సు ఏర్పాటుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం సిపిఐ నాయకులు ఏలూరు డిపో మేనేజర్ కార్యాలయ పర్యవేక్షకులకు కూడా వినతిపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ ఏలూరు జిల్లా కార్యవర్గ సభ్యులు బండి వెంకటేశ్వరరావు, చింతలపూడి ఏరియా ఏఐటియుసి నాయకులు చేపల్లి శ్రీనివాసరావు, పాల్గొన్నారు.

6న చలో విజయవాడ జయప్రదం చేయండి

విశాలాంధ్ర-జంగారెడ్డిగూడెం: మున్సిపల్ వర్కర్స్ సమస్యలు పరిష్కరించాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) రాష్ట్ర సమితి పిలుపు మేరకు దశల వారీ ఆందోళనల కార్యక్రమాల్లో భాగంగా

శనివారం ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జంగారెడ్డిగూడెం ఆధ్వర్యంలో స్థానిక మున్సిపల్ కార్యాలయం మస్టర్ పాయింట్ వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఏలూరు జిల్లా అధ్యక్షులు కూనపాముల విగ్నేష్ మాట్లాడుతూ మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని మార్చి 6వ తేదీ విజయవాడ నగరంలో జరిగే కార్యక్రమానికి అన్ని మున్సిపాలిటీల నుంచి పారిశుద్ధ్య, ఇంజనీరింగ్ కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని చలో విజయవాడ కార్యక్రమం పిలుపునిచ్చినట్టు తెలిపారు. ఈ నెల 24 వ తేదీన స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించాలని, ఈ నెల 28వ తేదీన అన్ని రాజకీయ పక్షాలు కార్మిక సంఘాలతో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించాలని, మూడో తేదీన చలో కలెక్టరేట్, ఆరవ తేదీన చలో విజయవాడ కార్యక్రమాలు రూపొందించడం జరిగిందని ఆయా కార్యక్రమాలను మున్సిపాలిటీల్లో ఉన్న పారిశుద్ధ్య ఇంజనీరింగ్ కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని ఆయన కోరారు. కంతేటి వెంకట్రావు మాట్లాడుతూ పర్మినెంట్ కార్మికులకు గత మూడు సంవత్సరాలుగా పెండింగ్ లో ఉన్న సరెండర్ లీవ్స్ ఎన్కాష్మెంట్, పెండింగ్ లో ఉన్న హెచ్ఆర్ఏ డిఏ సత్వరమే విడుదల చేయాలని, ఇంజనీరింగ్ కార్మికుల వేతనాల పెంపుదలకు గత సమ్మె లో నాటి ప్రభుత్వం తో అంగీకారం అయిన అగ్రిమెంట్ మేరకు వేతనాలు పెంచాలని కోరారు. మున్సిపల్ వర్కర్స్ గౌరవ అధ్యక్షులు జంపన వెంకట రమణరాజు మాట్లాడుతూ మున్సిపల్ ప్రభుత్వ ఉద్యోగ కార్మికులకు సిపిఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని, ప్రభుత్వ ఉద్యోగ కార్మికులు వలె ఆప్కాస్ ఔట్సోర్సింగ్ ఉద్యోగ కార్మికులకు రిటైర్మెంట్ వయస్సు 62 ఏళ్ళకు పెంచాలని మరియు హెల్త్ కార్డ్స్ ఇవ్వాలని, టెక్నికల్ కోర్స్ ఐటిఐ అర్హత బట్టి స్కిల్డ్ వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు .ఈ కార్యక్రమంలో ఎంపి మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ జంగారెడ్డిగూడెం ఇంజనీరింగ్ విభాగం సెక్రెటరీ నిమ్మల సుబ్బారావు, పారిశుద్ధ్య విభాగం కార్యదర్శి బొక్కా శ్రీనివాస్, కొత్తూరి నాగేశ్వరరావు,కొత్తూరి ఏమిలేశ్వరావు,దోసూరి నాగరాజు, అప్పలస్వామి,బాలు, ఆంజనేయులు, ప్రసాద్,కొత్తూరి శీను, కలపాల చంటియ్య,చాపల రమేష్, తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం

విశాలాంధ్ర - కలిదిండి: క్రీడలు మానసిక ఉల్లాసాన్ని పెంపొందిస్తాయని విద్యార్థులు క్రీడల్లో పాల్గొని తమ ప్రతిభను కనబరచాలని ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ అన్నారు.

శనివారం మండలంలోని ఆరుతెగలపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నియోజక వర్గ స్థాయి కైకలూరు బాలుర సబ్‌జోన్ ఆటల పోటీలను ఎస్సై వి. వెంకటేశ్వరరావు రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. బాలుర సబ్ జోన్ ఆటల పోటీలలో కామినేని పాల్గొని విద్యార్థులతో వాలీబాల్ ఆడారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి 2 వి. శ్రీనివాసరావు, హెచ్ఎం ఎ. శ్రీనివాసరావు, పేటేటి కనకలింగేశ్వరరావు, ప్రజాప్రతినిధులు, పాఠశాల యాజమాన్యం తదితరులు పాల్గొన్నారు.

బుర్రకథ పితామహుడు నాజర్ వర్ధంతి

విశాలాంధ్ర-జంగారెడ్డిగూడెం: మండలంలోని లక్కవరం గ్రంథాలయ శాఖ ఆవరణలో బుర్రకథ పితామహుడు పద్మశ్రీ నాజర్ వర్ధంతి సీనియర్ బుర్రకథ కళాకారులు సబ్బి కనకారావు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా నాజర్ చిత్రపటానికి పూలమాలలు

వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా కనకరావు మాట్లాడుతూ బుర్రకథలు ద్వారా నాటి ప్రజలను చైతన్య పరిచిన మహనీయుడు నాజర్ అని అన్నారు. సినీ కళాకారుల కన్నా ముందుగానే పద్మశ్రీ పొందిన ఘనత రంగస్థల కళాకారుడు నాజర్ కే దక్కుతుందన్నారు. ఆయన అడుగుజాడల్లో నడవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీనియర్ బుర్రకథ కళాకారులు వీరమల్ల సత్యనారాయణ, టీవీఎస్ రాజు, తడికమళ్ళ రామకృష్ణ, షేక్ ఫకీర్, వీరమల్ల మధు తదితరులు పాల్గొన్నారు.

అగ్రి ఆస్తులను జప్తు చేయాలి

అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ డిమాండ్

విశాలాంధ్ర -భీమవరం: అగ్రిగోల్డ్ కంపెనీ ఆర్థిక మోసాలకు బలైపోయిన లక్షలాదిమంది కస్టమర్లకు, ఏజెంట్లకు సత్వర న్యాయం చేకూర్చాలని, అగ్రి యాజమాన్యం బినామీ ఆస్తులను, కుటుంబ సభ్యుల పేర వున్న ఆస్తులను జప్తు చేయించాలని అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ భీమవరం బ్రాంచి గౌరవాధ్యక్షుడు ఎం.సీతారాంప్రసాద్, బ్రాంచి కార్యదర్శి కె.గోపాలకృష్ణ డిమాండ్ చేశారు. అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా తమ సమస్యల్ని ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లాలని బాధితులు భీమవరం ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులుకు శనివారం వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ అగ్రిగోల్డ్ కంపెనీ యాజమాన్యం 8 రాష్ట్రాల్లోని 32 లక్షల మంది నుండి పలు స్కీముల పేరుతో ప్రత్యక్షంగా 6,380 కోట్లను డిపాజిట్ల రూపంలో సేకరించిందని, మన రాష్ట్రంలో 19.52 లక్షలమంది నుండి 3,986 కోట్లను సమీకరించిందని, పరివార్ స్కీముల పేరుతో మరికొన్ని కోట్లను సేకరించి మోసం చేసిందని నిప్పులు చెరిగారు. కంపెనీ చైర్మన్ అవ్వా వెంకట రామారావు, ఆయన సోదరులు కంపెనీ డబ్బును

ఒక్కొక్కరు వందల కోట్లు వ్యక్తిగత ఆస్తులుగా కుటుంబ సభ్యుల పేర, బినామీల పేరున పెద్ద మొత్తాలను దాచుకుని కంపెనీ బోర్డు తిప్పేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అత్యవసర వైద్యం, విద్య, బిడ్డల పెళ్ళిళ్ళు లాంటి అవసరాలు ఉన్నవారికి, లక్షలోపు డిపాజిట్ చేసిన చిన్న పొదుపుదారులకు తక్షణ చెల్లింపులకు తగిన ఏర్పాట్లుచేసి వారి ఆత్మహత్యలు జరక్కుండా చూడాలని వారు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు వై.వీరకృష్ణ, బి.వెంకటేశ్వరరావు, ఎం.సాయిబాబు, ఆర్.పైడిరాజు, పి.మల్లేశ్వరరావు, పి.నరసింహాచారి తదితరులు పాల్గొన్నారు.

క్రీడల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు అభినందనలు

విశాలాంధ్ర - పెంటపాడు : స్థానిక ఎస్ టీవీఆఎన్ హిందూ ఎయిడెడ్ పాఠశాల, పెంటపాడులోతాడేపల్లిగూడెం జోనల్ స్థాయి ఆటల పోటీలు జరిగాయి.ఈ ఆటల పోటీలు 22 ,24 25 తేదీలలో వివిధ విభాగాలలో జరగనున్నాయి. ఈ పోటీలకు నియోజకవర్గ స్థాయిలో దాదాపు అన్ని పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు .మొదటి రోజు అనగా శనివారం జరిగిన అథ్లెటిక్స్ పోటీలలో పోస్ట్ బేసిక్ పాఠశాల నుండి ఏడుగురు విద్యార్థులు పాల్గొని ,6 విభాగాలలో మంచి ప్రతిభను కనబరిచారు.వారిలో జి.చాందిని (8ఉ వ తరగతి విద్యార్థిని 100 మీటర్ల పరుగు పందెంలో (బంగారు),షాట్ పుట్‌లో (బంగారు), డిస్కస్ త్రోలో (కాంశ్య), లాంగ్ జంప్ లో (వెండి) పతకాలు సాధించింది. టి .యుగంధర్ (9వ

తరగతి విద్యార్థి 200 మీటర్ల పరుగు పందెంలో (బంగారు),షేక్ సంధాని(9వ తరగతి షాట్ పుట్ లో కాంశ్య పతకం సాధించారు. వీరు శృంగవృక్షం లో జరుగు సెంట్రల్ జోన్ స్థాయిలో ఆడనున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను మండల విద్యాశాఖ అధికారులు టివి.రామకృష్ణ, ఎం. శ్రీనివాస స్కూల్ చైర్మన్ కళింగ లక్ష్మణరావు ప్రధాన ఉపాధ్యాయుడు ఎన్.రాజేష్, పిడి. యస్.దిలీప్, ఇంచార్జ్ ప్రధానోపాధ్యాయులు అరుణ కుమారి తదితరులు అభినందనలు తెలియజేశారు.

కొల్లేరు నిర్వాసితులకు న్యాయం చేసేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉంది

ఎంపీ పుట్టా మహేష్ కుమార్

విశాలాంధ్ర - గణపవరం: కొల్లేరు ప్రాంత నిర్వాసితులకు న్యాయం చేసేందుకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ తెలిపారు. శనివారం గణపవరం మండలం పిప్పర గ్రామంలో

ఉంగుటూరు శాసన సభ్యులు పత్సమట్ల ధర్మరాజు, జడ్పీ చైర్మన్ ఘంటా పద్మశ్రీ ప్రసాద్, టీడీపీ ఏలూరు జిల్లా అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులు, మాజీ ఎమ్మెల్సీ అంగర రామ్మోహన్ తో కలిసి పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పిప్పర లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, జి.ఎస్.ఆర్ విద్యా సంస్థలకు వెళ్లి ఉపాధ్యాయులు, విద్యావంతులను కలిసి ఎంపీ మహేష్ కుమార్ కరపత్రాలు పంపిణీ చేశారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గం నుంచి కూటమి ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న పేరాబత్తుల రాజశేఖర్ కు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని ఎంపీ కోరారు. ఈ కార్యక్రమంలో ఇందుకూరు రామకృష్ణంరాజు, తోట శీను, యాళ్ళ సుబ్బారావు, ఎన్డీఏ కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

శ్రీ చైతన్యలో ఫ్యామిలీ బ్లూమ్

విశాలాంధ్ర- ఏలూరు :స్థానిక శాంతినగర్ శ్రీచైతన్య పాఠశాలలో ఈనెల స్పార్క్ లివింగ్ ప్రోగ్రాం లో భాగంగా ఫ్యామిలీ బ్లూమ్ పేరిట విద్యార్థులకు

కుటుంబ విలువలను సామాజిక నైతిక బాధ్యతలను తెలియజేసేలా ఈ ప్రత్యేక కార్యక్రమం ఏర్పాటు చేశారు. కుటుంబ విలువలు ,సామాజిక బాధ్యత పెంపొందించే విధంగా , తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ఇతర పెద్దలను గౌరవిస్తూ క్రమశిక్షణ గల విద్యార్థిగా, బాధ్యత గల పౌరుడిగా మెలిగేందుకు నైతిక విలువలు ఎంతగానో ఉపయోగపడతాయని ప్రధానోపాధ్యాయురాలు బి .శివకుమారి అన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు వారికోసం అనునిత్యం శ్రమించే తమ తల్లిదండ్రులను, అమ్మమ్మ తాతయ్యలను వేదిక పైకి ఆహ్వానించి ప్రత్యేకంగా సన్మానించి వారి ఆశీస్సులు పొందిన వైనం తల్లిదండ్రులు తమ చిన్ననాటి జ్ఞాపకాలను ప్రత్యేక అనుభవాలను చిన్నారులతో పంచుకున్న విధానం ఆద్యంతం , అలరించాయి. ఈ సందర్భంగా శ్రీ చైతన్య విద్యాసంస్థల ఏలూరు- పాలకొల్లు రీజియన్ల ఏ.జి.ఎమ్ ఎస్.పార్థసారథి, రీజినల్ ఇంచార్జ్ సి.హెచ్. ఉదయభాస్కర్, ఎకడమిక్ కోఆర్డినేటర్ సి. హెచ్. వెంకటేశ్వరరావు విద్యార్థులను, తల్లిదండ్రులను ,సిబ్బందిని ప్రత్యేకంగా అభినందించారు. సభలో ఎకడమిక్ డీన్ జె.సంజీవ్ కుమార్ అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

స్వచ్ఛ -ఆంధ్ర, స్వచ్ఛ దివాస్

విశాలాంధ్ర - గండేపల్లి : గండేపల్లి మండలం మురారి గ్రామంలో శనివారం గ్రామ ఉపసర్పంచ్ జాస్తి వసంత్ ఆధ్వర్యంలో స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛదివస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కాకినాడ జిల్లా పంచాయతీ అధికారి రవికుమార్ హాజరయ్యారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతో అంటు వ్యాధులు రాకుండా జాగ్రత్త పడవచ్చు అని, ప్రతి ఒక్కరూ వారంలో ఒకసారైనా స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో పాల్గొని గ్రామాన్ని శుభ్రపరుచుకోవాలని జాస్తి వసంత్ గ్రామస్తులకు అవగాహన కల్పించారు. అనంతరం పంచాయతీ అధికారి రవికుమార్ చెత్త సంపద కేంద్రాలను పరిశీలించారు. చెత్త నుండి సంపద తయారు చేసుకోవచ్చని గ్రామస్తులకు సూచించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శిరీష, పారిశుధ్య సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

మహిళా సంరక్షణపై అవగాహన

విశాలాంధ్ర - కపిలేశ్వరపురం : అంబేద్కర్ కోనసీమ జిల్లా కపిలేశ్వరపురం మండలం నల్లూరు గ్రామంలో లిల్లి ప్యాక్ హమ్, గర్ల్స్ హాస్టల్‌లో మహిళాసంరక్షణపై అవగాహన నిర్వహించారు. మనం ఎక్కడ పుట్టాం అని కాకుండా మనం ఏస్థాయిలో ఉండాలో మనమే నిర్ణయించుకోవాలి, దానికి మంచి ఆలోచనలతో ముందుకు వెళ్లే విధంగా చదువుకోవాలని, చదువుకునే వయస్సులో చదువుపై పెట్టే శ్రద్ధ భవిష్యత్తు నిర్ణయిస్తుంది. చెడు స్నేహాలు జోలికి వెళ్లకుండా బాగా చదువుకొని అనుకున్న లక్ష్యాలను చేరుకుని, సీఐ దొర రాజు అన్నారు. ఉన్నత విలువలు గల వ్యక్తులుగా రాణించాలి, విద్యార్థి దశలో సోషల్ మీడియా జోలికి వెళ్లి, కాలాన్ని వృధా చేసుకోవద్దు, రానున్న కాలం పబ్లిక్ పరీక్షలు, కాలయాపన లేకుండా శ్రద్ధగా చదివి మంచి మార్కులతో పాస్ అవ్వాలన్నారు. 2007లో నలుగురితో స్టార్ట్ అయ్యి. 56 మెంబెర్స్‌తో రన్ చేస్తున్న ఆర్గనైజర్ జీ విజయ కాంతికి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో అంగర ఎస్సై, ఎస్సైఐ మహిళా పోలీస్‌లు సిబ్బంది పాల్గొన్నారు.

బాలాజీ ఆదాయం రూ.3.36 లక్షలు

విశాలాంధ్ర - మామిడికుదురు : అప్పనపల్లి శ్రీ బాల బాలాజీస్వామి దేవస్థానమునకు శనివారం వివిధ విభాగాల ద్వారా రూ.3,36,920లు ఆదాయం సమకూరిందని ఆలయ సహాయ కమిషనర్ ఎం సత్యనారాయణ రాజు తెలిపారు. ఇందులో శాశ్వత నిత్యాన్నదాన ట్రస్ట్‌కు రూ.21,748లు, నిత్యాన్నదాన ట్రస్ట్‌కు రూ.76,836లు ఆదాయం సమకూరిందన్నారు. 4,500 మంది భక్తులు స్వామివారిని దర్శనం చేసుకోగా 2,800 భక్తులు అన్న ప్రసాదం స్వీకరించారన్నారు.

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి : ఏఐటీయూసీ

విశాలాంధ్ర - పిఠాపురం : ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ అనుబంధం పిఠాపురం శాఖ యూనియన్ అధ్యక్షులు బంగారు కన్నయ్య ఆధ్వర్యంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర పిలుపు మేరకు ఫిబ్రవరి 17 నుంచి మార్చి 3 వరకు దసలవారీ ఆందోళన మార్చి 6న చలో విజయవాడ పెద్ద ఎత్తున తరలిరావాలని శనివారం స్థానిక మస్టర్ ఆఫీసు ఆవరణలో నిరసన కార్యక్రమం ఏర్పాటు చేసి, ఆప్కాస్ట్ రద్దు చేస్తే పర్మినెంట్ చేయాలని, జీతాలు పెంపు చేయాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ కల్పించాలని, కార్మికులు చనిపోయిన వారి స్థానంలో కుటుంబ సభ్యులకు ఉద్యోగ కల్పన కల్పించాలని తదితర డిమాండ్లుతో నినాదాలు చేశారు. యూనియన్ గౌరవ అధ్యక్షుడు సాకా రామకృష్ణ మీడియాతో మాట్లాడుతూ రాజకీయంలో ఎంతో సర్వీసున్న చంద్రబాబు నాయుడు మా కార్మికులు సర్వీసును దృష్టిలో పెట్టుకుని పర్మినెంట్ చేయాలని, జీతాలు పెంపు చేయాలని, కమ్యూనిస్టు భావాలు ఉన్న డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కమ్యూనిస్టు ఆలోచనతోనే వర్కర్ల సమస్యలు తీర్చాలని డిమాండ్ చేశారు. ఆప్కాస్ పోయి ప్రైవేటు ఏజెన్సీలకు ప్రైవేట్ సంస్థలకు అప్పగిస్తే సహించబోవని డైరెక్ట్‌గా పర్మినెంట్ చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ముత్యాల అప్పారావు, చెక్క అప్పలకొండ, పొట్నూరు అమ్ములు, ధనాల సతీష్, గూడుపు సత్యవతి, లంక ప్రసాద్, చిటికెలు దాసు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రజా దర్బార్ : ఎమ్మెల్యే

విశాలాంధ్ర - రావులపాలెం : ప్రజా సమస్యల పరిష్కారానికే ప్రజా దర్బార్ నిర్వహించడం ప్రజల మన్ననలు పొందుతుందని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. రావులపాలెం క్యాంపు కార్యాలయం వద్ద ఎమ్మెల్యే సత్యానందరావు, ఎంపీ గంటి హరీష్, రాష్ట్ర కొప్పుల వెలమ కార్పొరేషన్ చైర్మన్ పీవీ గణేష్ కుమార్ ప్రజా దర్బార్ కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై వినతి పత్రాలను సత్యానందరావు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజా సమస్యలపై అధికారులు అప్రమత్తంగా ఉండాలని, ప్రభుత్వం దీనిపై ప్రత్యేక శ్రద్ధ చూపుతుందని చెప్పారు. అధికారులు, ఉద్యోగులు ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేయాలని సత్యానందరావు సూచించారు. ఈ కార్యక్రమంలో వాసిరెడ్డి రాంబాబు, ఆకుల రామకృష్ణ, పునిగేల రఘురామ్, పాలూరి సత్యానందం, గుత్తుల పట్టాభి రామారావు, చిలువూరి సతీష్ రాజు, అయినవిల్లి సత్తిబాబు గౌడ్, జక్కంపూడి వెంకటస్వామి, సాధనల శ్రీను, పడాల బుల్లి కొండారెడ్డి మరియు కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

టెక్నాలజీ ఆధునికతపై అవగాహన

విశాలాంధ్ర - గండేపల్లి : గండేపల్లి మండలం సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీ కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ విభాగంలో లిడీప్ లెర్నింగ్ టెక్నిక్స్ ఇన్ ఎమర్జింగ్ టెక్నాలజీస్ అనే అత్యాధునిక అంశంపై అతిథి ఉపన్యాసం చేశారు. ప్రస్తుతం శరవేగంగా అభివృద్ధి చెందుతున్న కృత్రిమ మేధస్సు, డేటా సైన్స్ రంగంలో చక్కటి పరిజ్ఞానాన్ని ఎస్ఈజీ ఐ విశ్వ విద్యాలయం, మాలేసియాలో అసోసియేట్ ప్రొఫెసర్‌గా విశేష సేవలనందిస్తున్న ఆచార్య రాజ్‌మోహన్ పార్థసారథి ఆన్లైన్‌లో ఎంతో చక్కగా వివరించారు. విద్యార్థులు ఎన్నో సందేహాలను అడిగి నివృత్తి చేసుకున్నారు. అతిథి ఉపన్యాస శిక్షణ తరగతి ముగింపు కార్యక్రమంలో యూనివర్సిటీ డిప్యూటీ ప్రో ఛాన్సలర్ డా ఎం శ్రీనివాసరెడ్డి ఉపన్యసించారు. ఈ కార్యక్రమం కళాశాల విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడిం దని ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ ప్రొ వైస్ ఛాన్సలర్ అకడమిక్స్ డా ఎస్ రమాశ్రీ, రిజిస్ట్రార్ డా జీ సురేష్, డీన్ స్కూల్ ఆఫ్ ఇంజనీరింగ్ డా డోలా సంజయ్ ఎస్, అసోసియేట్ డీన్ స్కూల్ ఆఫ్ ఇంజనీరింగ్ డా ఎంవి రాజేష్, విభాగాధిపతి డా కే స్వరూప, కో ఆర్డినేటర్ కే గోవిందరాజు ఇతర అధ్యాపకులు పాల్గొన్నారు.

వాడపల్లి క్షేత్రానికి భక్తజనం

విశాలాంధ్ర - ఆత్రేయపురం : కలియుగ వైకుంఠం కోనసీమ తిరుమల వాడపల్లి వెంకటేశ్వరస్వామివారికి శనివారం భక్తులు నీరాజనాలు సమర్పించారు. ఉదయం వేకువజామునే సుప్రభాత సేవ అనంతరం స్వామివారికి నీరాజనం, మంత్రపుష్పం తదితర పూజా కార్యక్రమాలు అర్చక స్వాములు అంగరంగ వైభవంగా నిర్వహించి తనంతరం భక్తులకు దర్శనాలు కల్పించారు. వచ్చిన భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్త కుండా ఆలయ డిప్యూటీ కమిషనర్ నల్లం చక్రధర్ రావు ఏర్పాటును పూర్తి చేసి పర్యవేక్షించారు. ప్రసాద వితరణ, అన్నదానం నిర్వహించారు. ఆర్టీసీ అధికారులు సుదూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఏలేశ్వరం, ఏలూరు, రాజమహేం ద్రవరం, గోకవరం విజయవాడ, విశాఖపట్నం నుండి ప్రత్యేక బస్సులు నడిపారు. శనివారం స్వామి ఆదాయం రూ.46,97,535లు సాయంత్రం ఐదు గంటల వరకు వచ్చిన ఆదాయం. బుల్లితెర నటులు వర్షా స్వామివారిని దర్శించుకుని ప్రసాదాలు స్వీకరించారు. దేవస్థానం డిప్యూటీ కమిషనర్ నల్లం సూర్య చక్రధరరావు, సూపరెంట్ పి రాంబాబు వర్మ, మండల టిడిపి అధ్యక్షులు ముదునూరి వెంకటరాజు(గబ్బర్ సింగ్), లొల్ల సర్పంచ్ కాయల జగన్నాథం, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

క్రీడలు మానసిక వికాసానికి దోహదం

విశాలాంధ్ర - కొత్తపేట : ప్రతి విద్యార్థి చదువుతో పాటు ఆటలు ఆడాలని అప్పుడే విద్యార్థి మానసికంగా అభివృద్ధి చెందుతాడని కొత్తపేట సబ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ జి సురేంద్ర అన్నారు. భాష్యం విద్యా సంస్థల కొత్తపేట వారి ఆధ్వర్యంలో కోనసీమ జిల్లా భాష్యం స్కూల్ విద్యార్థులకు ఆటల-పోటీలు నిర్వహించారు. ఇంట్రా జోనల్ స్పోర్ట్స్ మీట్లో పాలకొల్లు, నరసాపురం, మండపేట, అమలాపురం, ముమ్మిడివరం, తాటిపాక, మల్కిపురం, రావులపాలెం, కొత్తపేట భాష్యం విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమంలో ప్రముఖ డాక్టర్ ఎస్‌వి గాంధీ, జోనల్ ప్రిన్సిపల్ జెవి శ్రీనివాస్, ప్రిన్సిపాల్ ఎం లోకేశ్వరరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రసన్నశ్రీకి సత్కారం

విశాలాంధ్ర - అమలాపురం : ఆక్కు యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్‌గా నియమితులైన ఆచార్య ఎస్ ప్రసన్నశ్రీని ప్రైవేటు డిగ్రీ కళాశాలల మేనేజ్మెంట్ అసోసియేషన్ ప్రతినిధులు గంధం నారాయణరావు, హబీబ్ భాష, బీవీసీ విద్యా సంస్థల చైర్మన్ బోనం కనకయ్య ఏబి నాయుడు అమలాపురం విట్స్ కళాశాల అధినేత ఏబి నాయుడు శాలువా, పుష్పగుచ్ఛంతో సత్కరించినారు. ఉన్నత విద్యాభివృద్ధిలో ప్రైవేటు డిగ్రీ కళాశాలల పాత్ర కీలకమైనదని, ఆదికవి నన్నయ్య యూనివర్సిటీ ఉపకులపతి ఆచార్య ఎస్ ప్రసన్నశ్రీ పేర్కొన్నారు. ఆదికవి నన్నయ్య యూనివర్సిటీ పరిధిలోని అనుబంధ డిగ్రీ కళాశాలల స్థితి గతుల గురించి, విద్యార్థుల ప్రగతి గురించి కూలంకుషంగా చర్చించినారు. వైస్ఛాన్సలర్ యూనివర్సిటీ పరిధిలోని కళాశాలలకు పూర్తి సహాయ సహకారాలు అందిస్తానని తెలియజేసినారు.

చెత్తను వేర్వేరుగా సేకరించాలి : డీపీవో

విశాలాంధ్ర - జగ్గంపేట : ఇళ్ళ నుండి సేకరిస్తున్న చెత్తను వేర్వేరుగా సేకరించాలని జిల్లా పంచాయితీ అధికారి వి రవికుమార్ పారిశుధ్య సిబ్బందిని సూచించారు. మండలంలోని రామవరంలో శనివారం జరుగుతున్న ఇంటింటి నుండి చెత్త సేకరణ స్పెషల్ డ్రైవ్ కార్యక్రమాన్ని ఆయన సందర్శించారు. ప్రతి ఇంటి నుండి తడి చెత్త, పొడి చెత్త వేరువేరుగా సేకరించి వర్మీ కంపోస్ట్ తయారు చేయాలని పారిశుధ్య సిబ్బందికి సూచించారు. తడి చెత్తను, పొడి చెత్తను వేర్వేరుగా వేయమని ఇళ్లకు వెళ్లి చెత్తను సేకరించే టప్పుడు వారికి తెలియజేయాలన్నారు. గ్రామంలో పరిసరాలు పరిశుభ్రంగా ఉంచే విధంగా చర్యలు తీసుకోవాలని పంచా యతీ కార్యదర్శి శివను ఆయన ఆదేశించారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ ఇంటింటికి వెళ్లి చెత్త సేకరించే కార్యక్రమం చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించిదన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా శని, ఆదివారం రెండు రోజులు ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. గండేపల్లి, జగ్గంపేట, కిర్లంపూడి మండలాల్లో జరుగుతున్న కార్యక్రమాలను పరిశీలించేందుకు రావడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ ఏవీఎస్ చంద్రశేఖర్, పంచాయతీ విస్తరణాధికారి జి భాస్కరరావు, సచివాలయ సిబ్బంది, పారిశుధ్య నిర్వహణ సిబ్బంది పాల్గొన్నారు.

సీసీలకు, వీఓఏలకు శిక్షణ

విశాలాంధ్ర - రాజోలు : డీఆర్‌డిఏ రాజోలు ఏరియా క్లస్టర్ పరిధిలోని రాజోలు, మామిడికుదురు, మలికిపురం, సఖినేటిపల్లి, పి గన్నవరం మండలాలకు చెందిన వీఓఏలు, సీసీలకు రెండు రోజుల రాజోలు మహిళా సమాఖ్య కార్యాలయంలో శిక్షణ తరగతులు నిర్వహించారు. జిల్లా డి.వరాల బాబు, జి దుర్గ ప్రసాద్, వమీ కాశింబిలు నేషనల్ రురల్ లైవ్లీ హుడ్ మిషన్ (NRLM) ద్వారా స్వయం సహాయక సంఘాల సభ్యులకు, గ్రామ సంఘాల వివరాలు లోకోస్ అప్లికేషన్ నమోదు, ప్రాథమిక సమాచారం, ఆర్థిక లావాదేవీల నమోదుపై సీసీలకు, వీఓఏలకు శిక్షణ తరగతులు నిర్వహించారు. శనివారంతో శిక్షణ తరగతులు ముగిసాయి. ఈ కార్యక్రమంలో జిల్లా నుంచి డీపీఎం ఐబీ ఎ గణేష్, ఎంపీఎం భూపతి వర్మ, సిసి దుర్గ, అకౌంటెంట్ మరియు విఓఏలు పాల్గొన్నారు.

విద్యార్థులకు దేశం, సమాజంపై అంకిత భావం ఉండాలి : డీఈవో

విశాలాంధ్ర - కడియం : విద్యార్థులు దేశం, సమాజంపై అంకిత భావం పెంపొందించుకోవాలని తూర్పుగోదావరి జిల్లా విద్యాశాఖాధికారి కె వాసుదేవ రావు అన్నారు. ఏవిఆర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు టి సత్యనారాయణ అధ్యక్షతన శనివారం స్కౌట్ దినోత్సవం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా వాసు దేవరావు మాట్లాడుతూ స్కౌట్, గైడ్ విద్యార్థులు అందరికీ ఆదర్శంగా ఉండాలని సూచించారు. అనంతరం జాతీయ జెండాను, స్కౌట్ జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా స్కౌట్ కార్యదర్శి రాజ్ కుమార్, మండల ఎంఈఓలు మణికుమార్, నాగేశ్వరరావు, గొల్లపల్లి సత్యనారాయణ, బి గిరిజ, ట్క వై వీర రాఘవ కుమారి, పిడీలు డేవిడ్, వీరబాబులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మనోజ్ దంపతులకు ఎంపీ తంగెళ్ళ శుభాకాంక్షలు

విశాలాంధ్ర - అనపర్తి : నియోజకవర్గ టిడిపి ఇన్చార్జ్, యువనేత నల్లమిల్లి మనోజ్‌రెడ్డి సుమేఘరెడ్డి వెడ్డింగ్ రిసెప్షన్ సందర్భంగా ఎంపీ తంగెళ్ళ ఉదయ శ్రీనివాస్ శుభాకాంక్షలు తెలిపారు. శనివారం రామవరంలో ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి నివాసంలో నూతన జంటకు కాకినాడ ఎంపీ శుభాకాంక్షలు తెలిపారు. రామకృష్ణారెడ్డి మహాలక్ష్మి దంపతుల తనయుడు మనోజ్ వివాహం ఈ నెల 8 న హైదరాబాద్‌లో అంగరంగ వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా ఆదివారం అనపర్తిలో ఎమ్మెల్యే నల్లమిల్లి భారీగా వివాహ విందుకు ఏర్పాటు చేయడం జరిగింది. రిసెప్షన్‌కు విచ్చేసే వేలాదిమంది అతిరథ మహారథులు, అతిథులు, పార్టీ నేతలు, కార్యకర్తలు, బంధు మిత్రులకు ఎటువంటి అసౌకర్యం, ఇబ్బందులు లేకుండా తగిన విధంగా ఏర్పాట్లు చేశారు.

విశ్వశాంతి దినోత్సవ ర్యాలీ

విశాలాంధ్ర -రాజమహేంద్రవరం రూరల్ : రాజమహేంద్రవరం ఆదిత్య బిజినెస్ స్కూల్ ఎన్.ఎస్.ఎస్ విద్యార్థులు ఈరోజు విశ్వశాంతి దినోత్సవం సందర్భంగా ర్యాలీని నిర్వహించారు. కళాశాల డైరెక్టర్ ఎస్పీ గంగిరెడ్డి ర్యాలీని ప్రపంచ శాంతికై విశ్వ మానవ మనుగడకై అనే నినాదంతో ప్రారంభించారు. ప్రపంచ శాంతి నెలకొల్పాలని దానికి అన్ని దేశాల అధ్యక్షులు ప్రధాన మంత్రులు, మంత్రులు ప్రయత్నించాలని తద్వారా ప్రపంచ శాంతి నెలకొంటుందని అన్ని దేశాలలోనూ శాంతిభావం పెరగాలని అన్నారు. విద్యార్థులు ఆదిత్య బిజినెస్ స్కూల్ నుంచి ఆర్టీసీ బస్సు కాంప్లెక్స్, షెల్టన్ హోటల్ మీదుగా ఈ ర్యాలీని నిర్వహించి వరల్డ్ పీస్ సంబంధించిన స్లోగన్స్ చేశారు. ఈ ర్యాలీలో కళాశాల ప్రిన్సిపాల్ డి రామకృష్ణ, ఎన్ఎస్ఎస్ డీన్ డాక్టర్ జి నాగేశ్వరరావు, అధ్యాపకుడు పి విజయ్ దేవన్ పాల్గొన్నారు.

బాల నేరస్థుల్లో మార్పు తీసుకురావాలి : సునీత

విశాలాంధ్ర - రాజమండ్రి సిటీ : బాల నేరస్థులను గుర్తించి వారిలో మార్పు వచ్చేలా చూడాలని తూర్పు గోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత సూచించారు. శనివారం జిల్లా న్యాయ సేవాధికారిక సంస్థ, రాజమహేంద్రవరం తూర్పుగోదావరి జిల్లా కార్యాలయంలో లీగల్ అండ్ డిఫెన్స్ కౌన్సిల్ అడ్వకేట్స్, స్త్రీ శిశు సంక్షేమ, పోలీసు శాఖల వారితో స్పెషల్ జువ్వానలై పోలీసు యూనిట్‌కి నిర్వహించిన శిక్షణ కార్యక్రమాన్ని జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ బాల నేరస్తులను గుర్తించి వారిని సమాజంలో మంచి పౌరులుగా తీర్చి దిద్దాలని ఆకాంక్షించారు. సమాజంలో నేడు ఆధరణ కరువైందని, సరైన ప్రోత్సాహం లేని బాలలు నేరాల వైపు అడుగులేస్తున్నారని, చిన్న తనంలోనే నేరస్తులుగా మారుతున్నారన్నారు. వివక్షకు గురైన చిన్నారులు నేరా ప్రవృత్తి బాట పుడుతున్నారు. అటువంటి వారిని గుర్తించి సరైన మార్గంలో నడిచేలా ప్రోత్సాహించాల్సిన భాధ్యత అందరిపై ఉందన్నారు. చిన్నారులు నేరాల బాట పట్టకుండా చూడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు.పిల్లల్లో చైతన్యం నింపాలని ప్రధాన న్యాయమూర్తి సునీత అభిప్రాయపడ్డారు.నేరాలకు పాల్పడుతున్న వారిని గుర్తించి అబ్జర్వేషన్‌లో పెట్టి తిరిగి నేరాలకు పాల్పడకుండా ఉండేలా చూడాలన్నారు. తల్లిదండ్రులు పనికి వెళ్ళే సమయంలో ఇంటి వద్ద ఉన్న పిల్లలు తప్పులు చేసే అవకాశం ఉందని, అటువంటి వారిని గుర్తించి కౌన్సిలింగ్ ఇవ్వాలన్నారు. అరెస్టు చేసే సమయంలో సరైన ఆధారాలు డక్యూమెంటరీ రూపంలో ఉండాలన్నారు. అడిషనల్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ ఎన్‌బిఎం మురళీ, ప్రిన్సిపల్ మెజిస్ట్రేట్ మూడవ ఏ జె ఎఫ్ సిఎం, జిల్లా న్యాయ సేవాధికారిక సంస్థ సెక్రటరీ ఎన్ శ్రీలక్ష్మీ, కోనసీమ అడిషనల్ ఎస్‌పి ఏవిఆర్ పిబి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

చెత్త నుంచి సంపద సృష్టించేందుకు కృషి : శాంతమణి

విశాలాంధ్ర - రాజానగరం : ప్రతి గ్రామం నుండి చెత్తను సేకరించి తద్వారా సంపదను సృష్టించేందుకు ప్రతిఒక్కరు కృషి చెయ్యాలని తూర్పు గోదావరి జిల్లా గ్రామ పంచాయతీ అధికారి వి శాంతమణి అన్నారు. మండల కేంద్రమైన రాజానగరంలో శనివారం నిర్వహించిన చెత్త సేకరణ ప్రత్యేక డ్రైవ్ లో డివిజనల్ పంచాయతీ అధికారి ఎం.నాగలతతో కలిసి ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా గ్రామ పంచాయతీ అధికారి వి శాంతమణి మాట్లాడుతూ రాష్ట్ర పంచాయతీ రాజ్ కమీషనర్ ఆదేశాలు మేరకు జిల్లాలోని ప్రతి ఒక్క ఇంటిని రెండు రోజులు పాటు ప్రతి పంచాయతీ శాఖ అధికారులు,జిల్లా పంచాయతీ అధికారులు, జిల్లా సమన్వయ అధికారులు, రిసోర్స్ పర్సన్స్, ఎఫ్‌టిసీలు, డివిజనల్ పంచాయతీ అధికారులు, ఈవోపిఆర్డీలు కలిసి ఆయా క్షేత్ర స్థాయిలో పర్యటించడం జరుగుతుందన్నారు. నూరు శాతం ఇంటింటి నుండి చెత్త సేకరణ జరిగేలా అవసరమైన అన్నీ చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.స్వచ్ఛ సర్వేక్షణ్ పంచాయతీలుగా మన గ్రామాన్ని నిలిపే దిశగా అడుగులు వేయాలని పిలుపునిచ్చారు. నిజానికి ఎంత చిన్న గ్రామ మైనా ఇంటింటి నుండి చెత్త సేకరణ, చెత్త నుండి సంపద తయారీ, అక్కడ సంపద సృష్టి చేయడం వంటి వివరాలు ప్రతి వ్యక్తికి అవగాహన కల్పించేందుకు ఈ డ్రైవ్ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. డివిజనల్ పంచాయతీ అధికారి ఎం . నాగలత, ఈవోపిఆర్డీ వాణి,పంచాయితీ కార్యదర్శి నిమ్మగంటి ప్రసాద్, ఇతర పంచాయతీ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

చోరీ నిందితుల అరెస్టు

రూ. 5.4 లక్షల చోరీ సొత్తు స్వాధీనం

విశాలాంధ్ర - కడియం : అనేక నేరాలకు పాల్పడిన ఐదుగురు ముద్దాయిలను కడియం పోలీసులు అరెస్టు చేసి, వారి వద్ద నుంచి చోరీ సొత్తును స్వాధీనం పరుచుకున్నట్లు రాజమండ్రి సౌత్ జోన్ డిఎస్పి ఎస్ భవ్య కిషోర్ వెల్లడించారు. చోరీలకు సంబంధించి కడియం పోలీస్ స్టేషన్లో జరిగిన విలేకరుల సమావేశంలో కడియం సిఐ ఏ వెంకటేశ్వరరావుతో కలిసి డీఎస్పీ భవ్య కిషోర్ వివరాలను వెల్లడించారు. కడియం మండలం జేగురుపాడు గ్రామానికి చెందిన గంగరాజు సత్యవతి జనవరి 18న ఆలయానికి వెళ్లి వస్తుండగా ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు ఆమె మెడలో ఉన్న బంగారపు నగలను లాక్కుని పారిపోయినట్లు ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసిన కడియం పోలీసులు ఆ దిశగా కడియం సిఐ ఏ వెంకటేశ్వరావు, బివిఎన్‌డి ప్రసాద్ దర్యాప్తు ప్రారంభించారు. శనివారం ముద్దాయిలైన వివిధ మండలాలకు చెందిన కొత్తపల్లి త్రిమూర్తులు, కూరాకుల సుబ్బారావు, గాధంశెట్టి వెంకన్న, పచ్చరాజు, గుమ్మడి సత్యనారాయణ మూర్తిలను అరెస్టు చేసినట్లు డిఎస్పి వెల్లడించారు. కడియం, మండపేట రూరల్ పోలీస్ స్టేషన్ ల పరిధిలో జరిగిన దొంగతనాలలో ముద్దాయిల వద్ద నుండి 58 గ్రాముల బంగారు ఆభరణాలతో పాటు వెండి, ద్విచక్ర వాహనం, కాపర్ వైరు, రూ. 50 వేలు నగదు మొత్తం రూ. 5.4 లక్షలు విలువ చేసే చోరీ సొత్తును స్వాధీన పరచుకున్నట్లు తెలిపారు. ముద్దాయిలను పట్టుకోవడంలో చురుకైన పాత్ర వహించిన సిఐ ఏ వెంకటేశ్వరరావు, బి యన్ డి ప్రసాద్, హెడ్ కానిస్టేబుల్ కే సురేష్ బాబు, కానిస్టేబుల్ ఎస్ జి ప్రసాద్ లను జిల్లా ఎస్పీ నరసింహ కిషోర్, డీఎస్పీ భవ్య కిషోర్ లు అభినందించారు.

కార్మికవర్గ రాజ్య స్థాపనతోనే దోపిడీ నుంచి మానవాళికి విముక్తి

విశాలాంధ్ర - కాకినాడ : కార్మిక వర్గ రాజ్య స్థాపనతోనే దోపిడీ నుండి మానవాళి విముక్తి జరుగుతుందని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం నాయకులు వి రాంభూపాల్ పేర్కొన్నారు. శుక్రవారం సాయంత్రం కచేరిపేట యుటిఎఫ్ హోమ్‌లో ప్రజాసంఘాల ఆధ్వర్యంలో రెడ్ బుక్ డే సందర్భంగా విఐ లెనిన్ రచించిన "రాజ్యం-విప్లవం" అనే గ్రంథంపై సదస్సు నిర్వహించారు. సిఐటియు అఖిలభారత ఉపాధ్యక్షురాలు జి బేబిరాణి అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో రాంభూపాల్ ముఖ్య వక్తగా పాల్గొని ప్రసంగించారు. మార్క్స్ ఎంగిల్స్ రచించిన కమ్యూనిస్టు మేనిఫెస్టో 1848 ఫిబ్రవరి 21న విడుదలైందన్నారు. ఆ తేదీ స్ఫూర్తిగా తీసుకుని వామపక్ష ప్రచురణ సంస్థలు 2019 నుండి రెడ్ బుక్ డే ప్రారంభించడం జరిగిందన్నారు. లెనిన్ సుప్రసిద్ధ రచన 'రాజ్యం-విప్లవం' 1917 సెప్టెంబర్‌లో విడుదలైందన్నారు. ఈ గ్రంథంలో సమాజ పరిణామంలో రాజ్యం పాత్రను అద్భుతంగా విశ్లేషించిందన్నారు. ఈ సదస్సుకి పలివెల వీరబాబు స్వాగతం పలుకగా జి ప్రభాకర వర్మ వందన సమర్పణ చేశారు.

యూత్ లీడర్‌షిప్‌పై వర్క్ షాప్

విశాలాంధ్ర - గండేపల్లి : గండేపల్లి మండలం సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీ విద్యార్థులలో నాయకత్వాన్ని ప్రేరేపించేందుకు వికసిత్ భారత్ చొరవ కింద ఆదిత్య యూనివర్సిటీ, సూరంపాలెంలో రోటరాక్ట్ క్లబ్ ఆధ్వర్యంలో యూత్ లీడర్‌షిప్ కార్యక్రమం నిర్వహించినట్లు యూనివర్సిటీ డిప్యూటీ ప్రో ఛాన్సలర్ డా ఎం శ్రీనివాస రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమానికి (రిటైర్డ్ లెక్చరర్ అండ్ మోటివేషనల్ స్పీకర్)సలాది శ్రీరామ చంద్రమూర్తి, (సర్కిల్ ఇన్‌స్పెక్టర్, పెద్దాపురం ఓ పర్సనాలిటీ డెవలప్‌మెంట్ ట్రైనర్) ఆర్ అంక బాబు ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రసంగించారు. సదస్సులో ఆయన మాట్లాడుతూ నాయకత్వం, ప్రేరణ, దేశ నిర్మాణంపై అభిప్రాయాలను పంచుకున్నారు. వైస్ ఛాన్సలర్ డా ఎంబి శ్రీనివాస్, ప్రో వైస్ ఛాన్సలర్ డా ఎస్ రమాశ్రీ, రిజిస్ట్రార్ డా జి సురేష్, డీన్ క్యాంపస్ లైఫ్ మేనేజ్మెంట్ ప్రొఫెసర్ వి సత్యనారాయణ, అసోసియేట్ ప్రొఫెసర్ డా వరప్రసాద్, రోట్రాక్ట్ క్లబ్ సభ్యులు వివి శ్రీమన్నారాయణ పాల్గొన్నారు.

దోమల నియంత్రణపై అవగాహన

విశాలాంధ్ర-పెరవలి : శనివారం పెరవలి గ్రామంలో భూపయ్య కెనాల్ గట్టు ఏరియాలో తణుకు వెక్టార్ బోర్న్ డిసీజెస్ కంట్రోల్ సబ్ యూనిట్ ఆఫీసర్ జి.వెంకటేశ్వరరావు క్షేత్రస్థాయిలో గ్రౌండ్ లెవెల్ బ్రీడింగ్ సోర్సెస్‌ను పరిశీలించి, అనంతరం ప్రజలకు కీటక జనిత వ్యాధులపై అవగాహన కల్పిస్తూ వారం రోజులు పైబడి స్తబ్దతతో కూడిన నీటి నిల్వలు దోమల పుట్టుకకు నిలయాలని, ఇండ్ల ఆవరణలో, నిరుపయోగ సామాగ్రిలో చిన్న చిన్న నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని నీటిని నిల్వ పెట్టుకునే పాత్రలను వారానికి ఒకసారి శుభ్రపరిచాలన్నారు. ప్రతి రోజు డ్రైడేగా పాటించడం ద్వారాను డ్రైన్‌లలో చెత్త వేయకుండా ఉండడం ద్వారాను దోమ పుట్టుకకు లార్వా దశలోనే చెక్ పెట్టాలని, ప్రజల భాగస్వామ్యంతో మాత్రమే దోమల నివారణ సాధ్యమని వివరించారు. ఈ కార్యక్రమంలో విలేజ్ హెల్త్ సెక్రెటరీ కె. సోనీ హెల్త్ అసిస్టెంట్ ఎ.ప్రేమ్ కుమార్ మరియు ఆశా కార్యకర్తలు టి.సుబ్బలక్ష్మి, ఎన్.లక్ష్మి,వై.కృష్ణ వేణి పాల్గొన్నారు.

పూల పరిశోధన కేంద్రం సందర్శన

శాలాంధ్ర - కడియం : ఒరిస్సా రాష్ట్రం నుంచి వచ్చిన ఉద్యాన అధికారిణి ప్రియాంక ఆధ్వర్యంలో అక్కడి రైతులు మండలంలోని వేమగిరి పూల పరిశోధనా ప్రాంతీయ కేంద్రంను శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా పరిశోధన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ డివిఎస్ రాజు పూలసాగు ప్రాధాన్యత, పూల పంటలను ఆశించే తెగుళ్లు, చీడపీడలు చేసే నష్టతీవ్రత, వాటిని నివారించే యాజమాన్య పద్ధతులు గురించి క్లుప్తంగా వివరించారు. అనంతరం రాజానగరం మండలంలోని కలవచర్ల కృషి విజ్ఞాన కేంద్రం సందర్శనకు బయలుదేరి వెళ్లారు. అక్కడ సీనియర్ సైంటిస్ట్ రఘునందన్ వీరందరికీ కూరగాయలు, వివిధ రకాల పంటల గురించి వివరించారు. ఒరిస్సా బృందం సత్యదేవా నర్సరీ (పుల్లా చంటియ్య)ని సందర్శించారు. ఈ కార్యక్రమంలో కడియం మండలం ఉద్యాన అధికారి డి. సుధీర్ కుమార్, ఉద్యాన సహాయకులు పాల్గొన్నారు.

కూటమి అభ్యర్థిని గెలిపించండి : ఎమ్మెల్యే

విశాలాంధ్ర - సీతానగరం: కూటమి ఎమ్మెల్సీ అభ్యర్థిని అఖండ మెజారిటీతో గెలిపిం చాలని ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ అన్నారు. రాజానగరం నియోజకవర్గం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ కోరుకొండ జనసేన పార్టీ కార్యాలయం విలేకరులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఫిబ్రవరి 27న జరగబోయే ఎమ్మెల్సీ గ్రాడ్యుయేట్ ఎలక్షన్‌లో గ్రాడ్యుయేట్స్ అందరూ ఎన్డీఏ కూటమి బలపరిచిన అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరం మొదటి ప్రాధాన్యత ఓటు వేసి అఖండ మెజారి టీతో గెలిపించాలని కోరారు. ఈ రాష్ట్రంలో గత ప్రభుత్వంలో అంతా విధ్వంస పాలన జరిగింది. జాబ్ క్యాలెండర్ ఇస్తానని మాట ఇచ్చి ఇవ్వలేని పరిస్థితులను మనందరం చూసాం అని ఐదు సంవత్సరాలలో ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి డీఎస్సీ అసలు ఒక్కసారి కూడా వేయలేదు.దీనివల్ల నిరుద్యోగులకు అన్ని విధాలుగా నష్టమే జరిగింది. గత ఐదేళ్లుగా గ్రాడ్యుయేట్స్ అందరూ కూడా ఎటువంటి ఉద్యోగ ఉపాధి అవకాశాలు లేక నిరుద్యోగు లుగా అనేక ఇబ్బందులను ఎదుర్కొన్నారు. కావున 20 లక్షల ఉద్యోగాలు ఇవ్వాలనే దృఢ సంకల్పంతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు , ఉప ముఖ్యమంత్రి కొణిదల పవన్ కళ్యాణ్ మానవ వనరుల శాఖ మంత్రివర్యులు లోకేష్ పూర్తిస్థాయిలో ప్రణాళిక రూపొందిం చడం జరిగింది. ఇప్పటికే పలు పెద్ద కంపె నీలను మన రాష్ట్రానికి తీసుకురావడం జరిగిం దన్నారు. నిరుద్యోగులకు ప్రతి ఒక్కరికి ఉద్యోగం కల్పించి నిరుద్యోగాన్ని నిర్మూలించే దిశగా అడుగులు వేస్తున్నారన్నారు. తమ అమూల్య మైన ఓటు కూటమి అభ్యర్థికి వేసి గెలిపించాలని కోరారు.

వర్మీ కంపోస్ట్ షెడ్డుకు స్థలం కేటాయించాలి : డీపీవో

విశాలాంధ్ర - ప్రత్తిపాడు : స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛ దివాస్ కార్యక్రమంలో భాగంగా ప్రతి ఇంటికి వెళ్లి చెత్తను సెకరించే ప్రత్యేక కార్యక్రమాన్ని మండలంలోని అన్ని గ్రామాల్లో కూడా నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజవర్గ కేంద్రమైన ప్రత్తిపాడు గ్రామపంచాయతీని జిల్లా పంచాయితీ అధికారి వి రవి కుమార్ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో తడి చెత్తను పొడి చెత్తను వేర్వేరుగా సేకరించాలని పారిశుధ్య సిబ్బందికి సూచించారు. ఇలా వేరు చేసిన చెత్త ద్వారా సంపద తయారు చేసే షెడ్డు గ్రామంలో లేకపోవడంతో త్వరగా వర్మీ కంపోస్ట్ షెడ్డుకు స్థలం కేటాయించాలని తహసీల్దార్‌కు పంచాయతీ ద్వారా లెటర్ వ్రాయాలని పంచాయతీ కార్యదర్శికి సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయితీ కార్యదర్శి జ్యోతుల పద్మరాజు, గ్రామ సచివాలయం సిబ్బంది, హెల్త్ సిబ్బంది పాల్గొన్నారు.

పన్నుల వసూలకు ప్రత్యేక ప్రణాళిక సిద్ధం చేయాలి : కమిషనర్

విశాలాంధ్ర - కాకినాడ : పన్నుల వసూలే లక్ష్యంగా నగరపాలక అధికారులు ప్రత్యేక ప్రణాళిక సిద్ధం చేస్తున్నారు. మొండిబకాయిల వసూల కోసం డివిజన్లలో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేస్తున్నారు. ఈ మేరకు కమిషనర్ భావన ఐఏఎస్ శారదమ్మగుడి వద్ద గల నగర పాలక సంస్థ కార్యాలయంలో అన్ని విభాగాల అధికారులు, సిబ్బంది, సచివాలయాల సిబ్బందితో సమావేశమయ్యారు. పన్నుల వసూలు విషయంలో ఏ మాత్రం అశ్రద్ధ వహిం చవద్దని కమిషనర్ భావన సూచించారు. ముఖ్యంగా పన్నుల చెల్లింపు విషయంలో ప్రజలకు పూర్తిగా అవగా హన కల్పించాలన్నారు. అలాగే ప్రతి వార్డుకు నోడల్ ఆఫీసర్, అడ్మిన్, సెక్రటరీలను ఏర్పాటు చేసి పన్నుల వసూలు బాధ్యత అప్పగించాలని సూచించారు. ఆయా డివిజన్లలో మొండిబకాయిదారుల నుంచి పన్నులను వసూలు చేయడంలో వీరందరూ ప్రత్యేక శ్రద్ధ కనబరచా లని ఆదేశించారు. వార్డులోని పన్నులను నోడల్ ఆఫీసర్, సర్కిల్ పరిధిలోని పన్నులు ఆయా సర్కిల్ ఆఫీసర్లు వసూలు చేయించాలని తెలిపారు. పన్నులపై ఏప్రిల్ నుంచి వడ్డీ పెరిగే అవకాశం ఉందనే విషయాన్ని ప్రజల్లోకి తీసుకువెళ్లాలన్నారు. మార్కెట్ రేటు పెరిగిన నేపథ్యంలో పన్నులు రివైజ్ చేసే అవకాశం ఉందని, ఆ విషయాన్ని వివరించి పన్ను బకాయిలను త్వరితగతిన చెల్లించేలా అవగాహన కల్పించాలన్నారు. నీటి పన్నులు చెల్లించని మొండిబకాయిదారుల ఇళ్ల వద్ద కుళాయిలను కనెక్షన్‌ను తొలగించాలని సూచించారు. ఈ సమావేశంలో అదనపు కమిషనర్ కెటి సుధాకర్, డిప్యూటీ కమిషనర్ కె మనోహర్, నగరపాలక కార్యదర్శి శ్రీకాంత్‌రెడ్డి, మేనేజర్ సత్యనారా యణ, ఆర్ఓ శిరీష్, టీపీఆర్వో శైలజ, అన్ని విభాగాల సూపరింటెండెంట్లు, సచివాలయాల ఇన్ చార్జులు, నోడల్ ఆఫీసర్లు, తదితరులు పాల్గొన్నారు.

పేరాబత్తులకు మొదట ప్రాధాన్యత ఓటు : ఎమ్మెల్యే

విశాలాంధ్ర-దేవరపల్లి: పట్టభద్రులు ఎమ్మెల్సీ కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్ మొదట ప్రాధాన్యత ఓటు తో గెలిపించాలని గోపాలపురం నియోజకవర్గ ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు పేర్కొన్నారు దేవరపల్లి మండలంలో శనివారం దేవరపల్లిలోని శ్రీ చైతన్య పాఠశాల, దేవరపల్లి మండలం ఎర్నగూడెం సెంట్ జోసెఫ్ స్కూల్లో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు ఆండ్రు అనిల్, మాజీ ఎంపీపీ గద మురళి, అజిత్ కుమార్, టిడిపి నాయకులు గన్నమని హరికృష్ణ సుంకర దుర్గారావు, ఉప్పులూరి రాంబాబు, బల్ల సూరి చక్రం, బి సురేంద్ర, పరిమి దొర వరప్రసాద్, చిలక రాజేష్, జనసేన నాయకులు కంబాల సత్తిబాబు జాజిమొగ్గల శీను సూరిశెట్టి బాలు అలాగే ఎర్నగూడెంలో టీడీపీ నాయకులు బొల్లిన విజయభాస్కర్ గద్దె శ్రీనివాసరావు బాదంపూడి ఇంద్ర జనసేన పార్టీ మండల అధ్యక్షుడు కే గణేష్ రాము కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మానసిక వికాసానికి క్రీడలు దోహదం

విశాలాంధ్ర - రాజానగరం : శారీరక, మానసిక ఆరోగ్యా నికి క్రీడలు ఎంతో దోహదం చేస్తాయని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య సాతుపాటి ప్రసన్నశ్రీ అన్నారు. మండలంలోని ఆదికవి నన్నయ వర్సిటీ నందు యూనివర్సిటీ ఉమెన్స్ సెల్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని మహిళా క్రీడా పోటీలను విసి శనివారం ప్రారంభించారు. క్రికెట్ మైదానంలో క్రీడాకారులకు శుభాకాంక్షలు తెలిపిన విసి అనంతరం బ్యాటింగ్ చేసి పోటీలు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మార్చి 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని విశ్వవిద్యాలయంలో సిబ్బందికి, విద్యార్థులకు వివిధ క్రీడా పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. క్రికెట్, త్రో బాల్, బ్యాడ్మింటన్, చెస్, మ్యూజికల్ చైర్స్ వంటి పోటీలు ఏర్పాటు చేసారన్నారు. డాన్స్, సింగింగ్, స్కిట్, ఫ్యాషన్ షో వంటి సాంస్కృతిక కార్యక్రమాలు మరియు ఎలక్యూషన్, వీడియో ప్రెజెంటేషన్, పెయింటింగ్, వేస్ట్ టు వెల్త్ వంటి వంటి ప్రత్యేక కార్యక్రమాలు ఏర్పాటు చేశారని చెప్పారు. ఈ సందర్భంగా వీసీ ప్రసన్నశ్రీ మాట్లాడుతూ విశ్వవిద్యాల యంలో చక్కని వాతావరణం నెలకొని ఉందని దీనిని సద్వినియోగం చేసుకుంటూ శారీర వ్యాయమం, క్రీడల్లో పాల్గొనడం ద్వారా మహిళలు ఆరోగ్యంగా ఉంటారన్నారు. రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్, ఉమెన్స్ సెల్ కోఆర్డినేటర్ ఆచార్య ఉమా మహేశ్వరి దేవి పాల్గొన్నారు

డిఎల్ఆర్ కళాశాలలో ఏఐసిటీ మార్గదర్శన్ వర్క్ షాప్

విశాలాంధ్ర - పెదపూడి : మండలంలోని జి మామిడాడ ద్వారంపూడి లక్ష్మణ్ రెడ్డి కళాశాలలో ఆదికవి నన్నయ్య యూనివర్సిటీ ఆధ్వర్యంలో అఖిల భారత సాంకేతిక విద్య మండలి వారు స్పాన్సర్ చేసిన వర్క్ షాప్ ఏఐసిటీ మార్గదర్శన్ పథకంలో భాగంగా నిర్వహించబ డుచున్నదని కళాశాల ప్రిన్సిపాల్ డా తేతల శ్రీనివాస రెడ్డి తెలిపారు. ఈ వర్క్ షాప్ 25వరకు జరుగుతాయని ప్రిన్సిపాల్ తెలిపారు. ఈ పథకంలో భాగంగా ఆదికవి నన్నయ్య యూనివర్సిటీ 5 కళాశాలలను గుర్తించినారు. డియన్ఆర్ కళాశాల భీమవరం, బివి రాజు కళాశాల భీమవరం, యస్‌వికెపి అండ్ డా కెయస్ రాజు ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల పెనుగొండ, డిఎల్ఆర్ కళాశాల, జి మామిడాడ, డా సియస్‌యన్ డిగ్రీ అండ్ పిజి కళాశాల, భీమవరంలలో ఈ వర్క్ షాప్ కార్యక్రమాలు జరుగునని మార్గదర్శన్ పథకం కో ఆర్డినేటర్ మరియు ఆదికవి నన్నయ్య యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ పి వెంకటేశ్వర రావు తెలియజేసారు. ఈ వర్క షాప్ ద్వారా కళాశాల అధ్యాపకులు తమ నైపుణ్యాలను పెంచుకుని కళాశాలకు మంచి నాక్ మరియు యన్ఐఆర్ఎఫ్ గ్రేడ్స్ పొందవచ్చునని తెలియజేసారు. అదే విధంగా యన్ఐఆర్ఎఫ్ సంస్థ నుంచి మంచి ర్యాంకింగ్‌లను సాధించుకోవచ్చని తెలి యజేసారు. ఈ కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్‌గా వ్యవ హరించిన యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ పి విజయనిర్మల అధ్యాప కులకు తగిన అవగాహన కలిగించినారు. అదే విధంగా మరో రిసోర్స్ పర్సన్‌గా వచ్చిన డైరెక్టర్ ఐక్యూ ఏసీ ఆదికవి నన్నయ్య యూనివర్సిటీ ప్రొఫెసర్ డా వి పెర్సిస్ అధ్యాప కులకు కళాశాలకు యన్ఐఆర్ఎఫ్ ర్యాంక్ పొందుటకు కావలసిన విషయాలపై అవగాహన కల్పిం చారు. ఈ కార్యక్రమానికి కళాశాల కరస్పాండెంట్ ఆర్‌కె రెడ్డి, వైస్ చైర్మన్ డి వివేకానంద రెడ్డి, హెచ్ఓ డి మురళి, వాసు, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ త్రివేణీ మరియు అధ్యాపక అధ్యాపకేతర సభ్యులు పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేశారు.

అంగన్‌వాడీలకు శిక్షణ

విశాలాంధ్ర-దేవరపల్లి: దేవరపల్లి అంబటి సత్యనారా యణరావు జిలా పరిషత్ హైస్కూల్‌లో ఎంఈఓ తిరుమల దాస్ ఆధ్వర్యంలో, హెచ్ఎం శ్రీలక్ష్మి అధ్యక్షతన జరుగుతున్న అంగన్వాడి 120 రోజుల శిక్షణ కార్యక్రమంలో నాలుగో శనివారం శిక్షణ కార్యక్రమాన్ని ఎంఈవో, ఏపీసీ ఎస్ సుభాషిని పరిశీలించారు. కార్యక్రమంలో వారు మాట్లాడుతూ అంగన్వాడీ సెంటర్‌ను ఫౌండేషనల్ స్కూల్స్‌గా, అంగన్వాడీ టీచర్లను ఈసీసీఈ టీచర్లుగా సంబోధించాలని సూచించారు. సెంట ర్లను ఏ విధంగా బలోపేతం చేయాలి అనే అంశాలపై తగు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో సిడిపిఓ నాగలక్ష్మి అంగన్వాడీ సెంటర్లో జరుగుతున్న కార్యక్రమాలను వివరిం చారు. ఈ కార్యక్రమంలో సృజనాత్మకతకు సంబంధం చిన అంశాలను చాలా అద్భుతంగా ప్రదర్శించారు.ఈసీసీ దేని ఆహ్లాదకరమైన వాతావరణంలో నాటికీకరణ రూపంలో నిర్వహించారు.. జిల్లా రిసోర్స్ పర్సన్ మహాలక్ష్మి, విజయ శాంతి, శ్రీదేవి, నీరజ, విజయలక్ష్మి, శశికళ శిక్షణ యిచ్చారు.

జ్ఞానజ్యోతిపై అవగాహన

విశాలాంధ్ర - జగ్గంపేట, కిర్లంపూడి : జ్ఞాన జ్యోతి శిక్షణ కార్యక్రమంలో నేర్చుకుంటున్న బోధన పద్ధతులను అంగన్వాడీ కేంద్రంలో అమలు చేయాలని ఎంఈఓ ఎం చిన్నారావు కోరారు. స్థానిక కొక్కొండ రామశేష గిరి పంతులు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఐసిడిఎస్ విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అంగన్వాడి కార్యకర్తల శిక్షణ కార్యక్రమం నాలుగవ రోజు శనివారం జరిగింది. డిఆర్‌పిలు ఎస్ సాయి కృష్ణ, ఆర్ జయశ్రీ. పి వరలక్ష్మి, పి బూసమ్మ. కరీమున్నీసా తదితరులు ఉన్నారు.

బాధితులకు ఆర్థిక సాయం

విశాలాంధ్ర - ప్రత్తిపాడు : ఎంఎంఆర్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ప్రత్తిపాడు నియోజకవర్గ వైసిపి నేత ముదునూరి మురళి రాజు మండలంలో పలు గ్రామాల్లో శనివారం విస్తృత స్థాయి పర్యటన చేశారు. పలువురు బాధితులకు పరామర్శతో పాటు ఆర్థిక సాయం అందించారు. ఒమ్మంగి గ్రామానికి చెందిన కొప్పన బాబురావు భార్య ఇటీవల మరణించారు. బాబురావు వారి కుమారుడుని పరామర్శించారు. అలాగే వేములపాలెం గ్రామానికి చెందిన చందక నానిబాబు తండ్రి చందక కృష్ణ ఇటీవల మృతి చెందారు నానిబాబు కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా మురళి రాజు వెంట గ్రామ వైసిపి నాయకులు లొండ బాబు, మేక చంటిబాబు, దేవ లక్ష్మణ్ తదితరులు ఉన్నారు. పోతులూరు గ్రామంలో ఇందన రాము ఇటీవల స్వర్గస్తులయ్యారు. వారి కుటుంబాని పరామర్శించి రూ.5 వేలు ఆర్థిక సాయం చేసి, కష్టంలో ఉన్న ప్రతి పేదవారికి అండగా ఉంటానని ఆ కుటుంబానికి భరోసా కల్పించారు. అదేవిధంగా వివిధ బాధిత కుటుంబాలను పరామర్శించి ఆర్థిక సాయం చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బొండి రాంబాబు, శెట్టి సత్తిబాబు, ఎంపీటీసీ ముప్పిడి ఏసుబాబు, టేకు శ్రీహరి, టేకు రవి బాబు, శెట్టి నాగరాజు, చెక్కపల్లి నాగేశ్వరరావు, చెక్కపల్లి బుజ్జిబాబు, శెట్టి నాగరాజు, కొల్లు మునలయ్య, ఎంపీటీసీ నానిపల్లి చంటి, కోలా తాతబాబు, బొల్లు నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్యంపై ప్రత్యేక డ్రైవ్

విశాలాంధ్ర - ఉండ్రాజవరం: ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మండలంలోని అన్ని గ్రామాలలో శనివారం పారిశు ధ్యం పై ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు దీనిలో భాగంగా ఆయా గ్రామాల సర్పంచులు, కార్యదర్శులు, పారిశుధ్య సిబ్బంది పాల్గొని, రోడ్లపై చెత్త, డ్రైనేజీల లో సిల్ట్ తొలగించి, ప్రజలకు తడి చెత్త, పొడి చెత్త వేరువేరుగా పారిశుద్ధ్య సిబ్బందికి అందజేసేలా అవగాహన కల్పించారు. సూర్యా రావుపాలెంలో పంచాయతీ కార్యదర్శి రతన్ బాబు, సాయిరాం, రఘురామ్, రామకృష్ణలు, ఈవోపిఆర్డి ఏ ఆంజనేయ శర్మ, మండల శానిటరీ కోఆర్డినేటర్ కె ప్రకాష్ పాల్గొన్నారు.

40 లక్షల ఇళ్ల స్థలాల సాధనకు సిద్ధం కండి : డేగా

విశాలాంధ్ర - ముమ్మిడివరం : డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా సిపిఐ కౌన్సిల్ సమావేశం స్థానిక సీపీఐ కార్యాలయం ముమ్మిడివరంలో సీపీఐ తాలూకా కార్యదర్శి శీలం వెంకటేష్ అధ్యక్షతన శనివారం జరిగింది. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కామ్రేడ్ డేగా ప్రభాకర్‌రావు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో పేదలు మధ్యతరగతి వారు ఇంటి స్థలాలు, టిడ్కో గృహాలు సాధనకై 40 లక్షల మంది లబ్ధిదారులు తరఫున పోరాటానికి సిద్ధం కావాలని సీపీఐ శ్రేణులకు ఆయన పిలుపునిచ్చారు. ప్రస్తుత తరుణంలో దేశ యువత కమ్యూనిజం భావాలపై మొగ్గు చూపుతుందని దీనిని ఎదుర్కొనలేక కూటమి ప్రభుత్వం సంకుచిత హిందూ భావాలవైపు పయనిస్తూ కాలక్షేపం చేస్తుందని ఆయన ఎద్దేవా చేశారు. ఈ బడ్జెట్లో వ్యవసాయానికి కేవలం రూ.86 వేల కోట్లు కేటాయించగా 16 లక్షల కోట్లు కార్పొరేట్లకు దోచి పెట్టారని ఆయన విమర్శించారు. మార్చి 3 నుంచి 20 వరకు బడ్జెట్‌లో ప్రజా వ్యతిరేక విధానాలపై వామపక్షాల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మరొక ముఖ్య అతిథి సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు తాటిపాక మధు మాట్లాడుతూ మోదీ హయాంలో కార్మిక వర్గానికి ఔట్సోర్సింగ్ ఉద్యోగులకు తీరని అన్యాయం జరిగిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. దేశంలో రోజురోజుకు నిరుద్యోగం పెరుగుతుందని లక్షలాదిమంది యువకులు ఉపాధి లేక రోడ్డున పడుతున్నారన్నారు. సంవత్సరానికి రెండు కోట్ల మంది యువతకు ఉద్యోగాలు కల్పిస్తానని మోదీ ఇచ్చిన హామీని మర్చిపోయారని తక్షణమే అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. మోదీ అనాలోచిత నిర్ణయాల వల్ల 750 మంది రైతులు ప్రాణాలు కోల్పోయారన్నారు. ఇప్పటికైనా కళ్లు తెరిచి అభ్యుదయ రైతు చట్టాలను, విద్యుత్ విధానాలను అమలు చేయాలని ఆయన కోరారు. మరొక ముఖ్య అతిథిగా పాల్గొన్న సిపిఐ జిల్లా అధ్యక్షులు కామ్రేడ్ కే సత్తిబాబు మాట్లాడుతూ పార్టీ నిర్మాణంపై దృష్టి పెట్టాలని ప్రస్తుత తరుణంలో ఆంధ్ర రాష్ట్రంలో రాజకీయ సూన్యత ఏర్పడిందని కూటమి ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలకు విసిగి వేసారిన యువతను పార్టీ కార్యక్రమాలలో భాగస్వామ్యులను చేయాలని సీపీఐ పార్టీ శ్రేణులకు ఆయన పిలుపునిచ్చారు. పేదలు, మధ్యతరగతి వారిని ఇంటి స్థలాలు, ఐదు లక్షల గృహ రుణాలు కొరకు లబ్ధిదారులతో నేరుగా కలెక్టర్‌కు దరఖాస్తులు ఇప్పించే కార్యక్రమాన్ని మరింత ఉధృతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నిమ్మకాయల శ్రీనివాసరావు, గుడాల వెంకటరమణ, వనచర్ల విజయకుమార్, కే రామకృష్ణ, నేలపూడి నాగభూషణం, పితాని ఆనందరావు, చెల్లుబోయిన తాతారావు, సానబోయిన మనోహర్, డి వీరంశెట్టి, ఎన్ సుందరయ్య, పెద్దిరెడ్డి రాములతోపాటు పలు ప్రజా సంఘాల నాయకులు సిపిఐ అభిమానులతో పాటు పలువురు పాల్గొన్నారు.

కాకినాడ రైల్వే ఇనిస్టిట్యూట్ ఎన్నికల్లో బీముల్ రెడ్డి ప్యానెల్ ఘనవిజయం

విశాలాంధ్ర - కాకినాడ : రైల్వే ఇనిస్టిట్యూట్ ఎన్నికల్లో సౌత్ సెంట్రల్ రైల్వే ఎంప్లాయిస్ సంఘ్ భీముల్ రెడ్డి ప్యానెల్ SCRMUపై 9-0 తేడాతో ఘన విజయం సాధించింది. దీంతో మజ్దూర్ యూనియన్ ప్యానెల్ డిపాజిట్లు గల్లంతయ్యి చతికిలపడి క్లీన్ స్వీప్ కావడం గమనార్హం. ప్రలోభాలకు లొంగకుండా అసలైన అభివృద్ధికి, నిజాయితీకి పట్టం కట్టి విశ్వాసంతో ఓటింగ్ వేసిన కాకినాడ, సామర్లకోట ఇన్స్టిట్యూట్ సభ్యులకు కోశాధికారి తుమ్మ శ్రీనివాస్ ధన్యవాదాలు తెలిపారు. సెక్రటరీగా పి భీముల రెడ్డి, జాయింట్ సెక్రటరీగా సీహెచ్ రవిచంద్ర, కోశాధికారిగా వై వీరాంజనేయులు, వర్కింగ్ సభ్యులుగా వి రాజేష్ కుమార్, బి సంతోష్ కుమార్, టి వెర్రియ్య నాయుడు, కేవికె గోపాల్ రెడ్డి, ఆర్ సుబ్బారావు, బి రామకృష్ణలను ఎన్నుకున్నారు.

భూముల రీ సర్వే : కలెక్టర్

విశాలాంధ్ర -భీమవరం: రైతుల భూములకు ఖచ్చితమైన హద్దులను గుర్తించి రికార్డులు ఆధునీకరించేందుకే రీ సర్వే నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ చదలవాడ నాగరాణి పేర్కొన్నారు. భీమవరం మండలంలో రీ సర్వేకు పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసిన తుందుర్రు గ్రామంలో జరుగుతున్న రీ సర్వే గ్రౌండ్ ట్రూతినింగ్ పనులను, సరిహద్దుల మ్యాపులను శనివారం కలెక్టర్ చదలవాడ నాగరాణి క్షేత్రస్థాయిలో పరిశీలించి, రైతులతో రీ సర్వే పై ఏర్పాటుచేసిన గ్రామసభలో పాల్గొన్నారు. తొలుత రైతులతో మాట్లాడుతూ రీ సర్వే ప్రయోజనాలను వివరించి, వారికి ఉన్న సందేహాలను నివృత్తి చేశారు. అధికారులు ముందుగా మీకు నోటీసులు అందజేస్తున్నారా అని అడిగి తెలుసుకున్నారు. రీ సర్వే పనులకు సంబంధించి రైతులు అధికారులకు సహకరించాలని అన్నారు. అనంతరం కలెక్టర్ తుందుర్రు గ్రామంలో ప్రభుత్వ నివేశనా స్థలాలను పరిశీలించి గ్రామంలో ఎన్ని లేఔట్లు ఉన్నాయి, ఎంతమంది లబ్ధిదారులు గృహ నిర్మాణాలు చేసుకున్నారు తదితర వివరాలను తహసిల్దార్‌ను అడిగి తెలుసుకున్నారు. స్థానిక నాయకులు మాట్లాడుతూ 39 లబ్ధిదారులకు కేటాయించిన లేఅవుట్ బాగా లో లైన్ ఏరియాలో ఉందని, గృహ నిర్మాణాలకు అనువుగా లేదని కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. కార్యక్రమంలో ఆర్డీవో కె.ప్రవీణ్ కుమార్ రెడ్డి, తహసిల్దార్ రావి రాంబాబు, డిప్యూటీ తహసిల్దార్ ఇ.నాగార్జున, ఎంపీడీవో ఎన్. మురళీ గంగాధర్, ఇరిగేషన్ ఏఈ ఎన్.వెంకటేశ్వర్లు, గ్రామ సర్పంచ్ ఆరేటి వీరాస్వామి నాయుడు, ఎంపీపీ వాసు, గ్రామ కార్యదర్శి భవాని, వీఆర్వో, ఏఎన్ఎంలు, సచివాలయం సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.

పరిశ్రమల వ్యర్థాలను తగ్గించాలి : కలెక్టర్ ప్రశాంతి

విశాలాంధ్ర - రాజమండ్రి సిటీ : పరిశ్రమల నుంచి వచ్చే వ్యర్థాలను తగ్గించడం ద్వారా పర్యావరణాన్ని కాపాడు కోవచ్చునని తూర్పు గోదావరి జిల్లా కలెక్టర్ పి. ప్రశాంతి పేర్కొన్నారు. శనివారం తూర్పు గోదావరి జిల్లా కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో జిల్లా పారిశ్రామిక ప్రోత్సాహకకమిటీ సమావేశం జరిగింది. ఈసమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ పరిశ్రమల నుంచి వచ్చే వ్యర్థాలను తగ్గించాలని సూచించారు. రసాయనాలు ఎక్కువగా వదిలే పరిశ్రమలపై సేఫ్టీ బృందాలు ఎప్పటికప్పుడు తనిఖీలు చేయాలని, నివేదికలు సమర్పించాలన్నారు. జిల్లాలోని కెమికల్ ఆధారిత, ఇతర రసాయనాలు వెదజల్లే పరిశ్రమలను గుర్తించి నివేదికలు రూపొందించాలన్నారు. పరిశ్రమల్లో ఏ చిన్నపాటి పొరపాటు జరిగినా ఉపేక్షించేదిలేన్నారు. ప్రమాదాలు జరగక ముందే సమస్యలు గుర్తించాలన్నారు. గిరిజన ఉత్పత్తులను జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో అమ్మకాలు చేసేందుకు ఆన్‌లైన్ విధానాన్ని అమలు చేస్తున్నామన్నారు. యువతకు వివిధ రంగాలలో నైపుణ్యత పెంపొందించేందుకు శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. ఎమ్ఎస్ఎమ్ ఈ ఇంటింటి సర్వేలో భాగంగా 92 వేల 980 యూనిట్స్‌కు 49 వేల 949 యూనిట్స్ చేయడం జరిగిందన్నారు. మిగిలిన సర్వే వేగవంతం చెయ్యాలన్నారు. ఈసమావేశంలో జిల్లా పరిశ్రమల శాఖ అధికారి వనిధర్, అసిస్టెంట్ డైరెక్టర్ ప్రధీఫ్, విద్యుత్ శాఖ ఎస్.ఇ తిలగ్ కుమార్ , అగ్నిమాపక అధికారి మార్టిన్, జిల్లా రవాణా అధికారి సురేష్, జిల్లా నైపుణ్యాభివృద్ధి అదికారి మురళి, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ప్యాక్టరీస్ త్రినాధరావు ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు

సాగులో డ్రోన్ల వినియోగం : కలెక్టర్

విశాలాంధ్ర -భీమవరం: వరి సాగులో డ్రోన్ల వినియోగం ఎంతో లాభదాయకమని కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. శనివారం భీమవరం మండలం తుందుర్రు గ్రామంలో వరి పంటకు సోకిన అగ్గి తెగులు నివారణకు డైసోక్లోజోల్ 75%ను డ్రోన్ ద్వారా వెదజల్లే కార్యక్రమాన్ని కలెక్టర్ చదలవాడ నాగరాణి స్వయంగా పరిశీలించారు. డ్రోన్ ఆపరేటర్ మల్లుల శ్రీనివాసరావుతో మాట్లాడుతూ ఎంతవరకు చదువుకున్నారు, డ్రోన్ వినియోగంలో సహాయకులు ఎంతమంది ఉంటారు. ఎకరాకి ఎంత సమయం పడుతుంది, డ్రోన్ ఖరీదు ఎంత, రోజుకి ఎన్ని ఎకరాలు స్ప్రే చేయవచ్చు తదితర వివరాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. తుందుర్రు గ్రామంలో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఫార్మర్ రిజిస్ట్రీ నమోదు ప్రక్రియను కలెక్టర్ స్వయంగా పరిశీలించారు. కలెక్టర్ సమక్షంలో వ్యవసాయ విస్తరణ అధికారి బి.దేవి స్వరూప రైతులను వివరాలు అడిగి చేస్తున్న రైతు రిజిస్ట్రేషన్ ప్రక్రియను కలెక్టర్ పరిశీలించి తగు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులకు సంక్షేమ పథకాలు వర్తింప చేసేందుకు ప్రవేశపెట్టిన ఫార్మర్ రిజిస్టరిని ప్రతి ఒక్క రైతు సద్వినియోగం చేసుకోవాలన్నారు. జిల్లాలో 1.15 లక్షల రైతులకు రైతు రిజిస్టరీ పూర్తి చేయాల్సి ఉండగా ఇప్పటివరకు సుమారు 75 వేల మంది రైతులు వివరాలను నమోదు చేసి గుర్తింపు సంఖ్యను అందజేయడం జరిగిందన్నారు. 1.15 లక్షల మంది రైతులలో 90 వేల మంది పీ.ఎం కిసాన్ లబ్ధిదారులు ఉన్నట్లు తెలిపారు. కార్యక్రమాల్లో భీమవరం ఆర్డీవో కె.ప్రవీణ్ కుమార్ రెడ్డి, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి జెడ్.వెంకటేశ్వరరావు, డిఆర్సీ ఈవో జి.బాల నాగేశ్వరి, మండల వ్యవసాయ అధికారి ఎన్.శ్రీనివాస్, తహసిల్దార్ రావి రాంబాబు, ఎంపీడీవో ఎం.మురళి గంగాధర్, ఇరిగేషన్ ఏఈ ఎన్ వెంకటేశ్వరరావు, గ్రామ సర్పంచ్ ఆరేటి వీరాస్వామి నాయుడు, గ్రామ కార్యదర్శి భవాని, ఎంపీపీ వాసు, ఏఈఓ బి.దేవీ స్వరూప, డ్రోన్ పైలెట్ ఎం.శ్రీనివాసరావు, రెవెన్యూ వ్యవసాయ శాఖ, రైతు సేవా కేంద్రం సిబ్బంది,రైతులు పాల్గొన్నారు.

నిన్న చోరీ... నేడు రికవరీ

సిబ్బందిని ప్రశంసించిన జిల్లా ఎస్పీ

విశాలాంధ్ర - పెనుమంట్ర: పశ్చిమగోదావరి జిల్లా ఆచంట నియోజకవర్గంలోని పెనుగొండ గ్రామంలో భారీ చోరీ జరిగింది. జిల్లా ఎస్పీ నయుమ్ అస్మి ఐపీఎస్ ఆదేశాల మేరకు నరసాపురం డి.ఎస్.పి శ్రీవేద నేతృత్వంలో పెనుగొండ స్టేషన్ పరిధిలో పరిధిలో జరిగిన పలు దొంగతనాలపై ఖశ్చితమైన సమాచారం మేరకు శనివారం మధ్యాహ్నం పెనుగొండ ఎస్సైకె.గంగాధర రావు, పెనుమంట్ర ఎస్సైకె . స్వామి, ఆచంట ఎస్సై కె. వి రమణ. తన సర్కిల్ సిబ్బంది సహకారం, మధ్యవర్తుల సమక్షంలో పెనుగొండ సర్కిల్ ఇన్స్పెక్టర్ రాయుడు విజయ కుమార్ పెనుగొండ చివర చిన్న వారిపాలెం రోడ్డులో ఉన్న స్మశాన వాటిక దగ్గర ఉంటున్న నిందితుడిని అరెస్టు చేశారు. 21న ఎంపీడీవో ఆఫీసు వెనుక తాళం వేసి ఉన్న ఇంట్లోనికి వెళ్ళి తాళం బద్దలగొట్టి దొంగతనం చేసిన49 కాసుల బంగారు వస్తువులను స్వాధీనం చేశారు. ఈ కేసులో బండారు గణేష్ పరారిలో వున్నాడు. నేరస్తుడిని 24 గంటలలో కేసు చేధించి నిందితుడిని అరెస్టు చేసి, సొత్తునురికవర్, చేసినంచుకుగాను నర్సాపురం డీఎస్పీ డా. జి . శ్రీ వేదని, పెనుగొండ. సి ఐ రాయుడు విజయ్ కుమార్‌ని, పెనుగొండ ఎక్షిణ కె. గంగాధరరావు, పెనుమంట్ర ఎస్ఐ కె . స్వామి) ఆచంట ఏసీఐ కె.వి . రమణను, పెరుగొండ క్రైమ్ పార్టీ కానిస్టేబుళ్లు పీసీ 1050 జే. వెంకట్రావు, పీసీ 498 .కె గంగాధరరావు అలాగే సబ్ డివిజన్ క్రైమ్ పార్టీ కానిస్టేబుళ్లు పీసీ 547 మణికం, పీసీ 1005 సుబ్రహ్మణ్యం,పీసీ 2011 రాజేష్ లను జిల్లా ఎస్పీ అభినందించి నగదు బహుమతి ఇచ్చి ప్రోత్సహించి, ప్రజలందరికీ సీసీ కెమారాలను ఏర్పాటు చేసుకుంటే ఇటువంటి నేరాలను వెంటనే అధిగమించవచ్చునని, అందువల్ల అందరూ తప్పనిసరిగా సీసీ కెమారాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు.